PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 156 | విజయవాడ, మంగళవారం 7 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 7 January 2025 | Rs

పెంపుదల లేదంటూనే భారాలు

- విద్యుత్ ఛార్జీలపై సిపిఎం ఆందోళన
- నేటి విచారణలో అభ్యంతరాలు తెలుపుతామని ప్రకటన

2

రాష్ట్రంలో 4,14,40,447 మంది ఓటర్లు

- సిఇఒ వివేక్ యాదవ్ వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జనవరి ఒకటి నాటికి నమోదైన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు వివరాలను సిఇఒ వివేక్ యాదవ్ సోమవారం వెల్లడించారు. రాష్ట్రం మొత్తమ్మీద 4,14,40,447 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుష ఓటర్లు 2,02,88,543 మంది, మహిళా ఓటర్లు 2,10,81,814 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 3,400 మంది నమోదయ్యారు.

విద్యా సదస్సులో మాట్లాడుతున్న కేరళ మాజీ మంత్రి బేబి

ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఎన్ఇపి

- కేరళలో ప్రజాస్వామ్య, శాస్త్రీయ ప్రత్యామ్నాయ విద్యా విధానం
- యుటిఎఫ్ స్వర్ణోత్సవాల విద్యా సదస్సులో ఎం.ఎ.బేబి

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఇపి) ఆర్ఎస్ఎస్ నియంత్రణ, బిజెపి ఆధిపత్యంతో ఉందని కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి ఎం.ఎ.బేబి అన్నారు. కాకినాడలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యా సదస్సు జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో బేబి మాట్లాడుతూ విద్య కార్పొరేటీకరణ, వాణిజ్యకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ అనే నాలుగు రకాలుగా విద్యా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. కష్టమైనప్పటికీ కేరళ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక బిల్లును రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజార్టీ లేకుండానే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారన్నారు. ఇది కేంద్ర ఆధిపత్య ప్రాజెక్టు అని విమర్శించారు. ఆంగ్ల విద్య చాలా గొప్పదిగా మధ్యతరగతి ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇది అర్థంలేని వాదనని తెలిపారు. నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయుడు సివి రామన్ మాతృ భాషలోనే విద్య అభ్యసించిన విషయాన్ని గుర్తు చేశారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రాథమిక విద్యపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా నేడు కీలకంగా ఉండడానికి కారణం ప్రాథమిక విద్యను అందరికీ అందించడమేనని తెలిపారు. ఈ సదస్సులో ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి సిఎన్.భారతి, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, గోపిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆగని లైంగిక వేధింపులు : మరియం ధావలే

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయినా నేటికీ మహిళలపై లైంగిక వేధింపులు, దోపిడీ కొనసాగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన సమాన అవకాశాలు నేటికీ మహిళలకు అందని ద్రాక్షగా మిగతా 7లో

ఆర్థికశాఖ అనుమతి ఉంటేనే

మినిమం టైమ్ స్కేల్‌పై ప్రభుత్వ ఉత్తర్వులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కాంట్రాక్టు ఉద్యోగులందరికీ మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలన్న ఉద్యోగుల డిమాండ్‌కు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్థికశాఖ అనుమతి ఉన్న కాంట్రాక్టు పోస్టులకే మినిమం టైమ్ స్కేలును వర్తింప చేయాలని నిర్ణయించింది. ఈమేరకు జిఓ నెంబర్ 2ను సోమవారం విడుదల చేసింది. 2018లో ఏర్పాటుచేసిన 11వ వేతన సవరణ కమిషన్ సిఫార్సులపై 2021లో నిర్ణయం తీసుకుని, అందులో భాగంగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు 2022 జనవరి నుంచి మినిమమ్ టైం స్కేల్ అమలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ నిర్ణయం కాంట్రాక్టు ఉద్యోగులందరికీ అమలు కాలేదు. ఉదారవాద ఆర్థిక విధానాల్లో భాగంగా శాశ్వత ఉద్యోగనియామకాలను గణనీయంగా తగ్గించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వారికి బదులుగా కాంట్రాక్టు ఉద్యోగులను వివిధ శాఖల్లో నింపివేశాయి. వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లోనూ కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు పెద్ద ఎత్తున సాగాయి. అయితే, వీరి నియమాకాల్లో నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో మినిమం టైమ్‌స్కేలు ప్రకారం అత్యధిక మందికి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. అప్పటి నుండి వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగులు తమకు కూడా మినిమం టైమ్‌స్కేల్ వర్తింపచేయాలని కోరుతున్నారు. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆర్థికశాఖ అనుమతితో జరిగిన కాంట్రాక్టు నియమాకాలకే మినిమం టైమ్ స్కేల్ వర్తింపచేస్తామని పేర్కొంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఇది వర్తించదని జిఓలో ప్రభుత్వం పేర్కొనడం విశేషం. ప్రమాదాల్లో ఉద్యోగులు మరణించిన సమయంలో వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల పరిహారం, సాధారణ మరణం సమయంలో రెండు లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్త నియామకాలపై ఆంక్షలు

ఇకపై కొత్త నియామకాలు వద్దంటూ ఆర్థికశాఖ స్పష్టం చేసింది. ఒకవేళ అత్యవసరంగా కావాలనుకుంటే తమ అనుమతి ముందుగా తీసుకోవాలని తేల్చిచెప్పింది. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

180 రోజులు ప్రసూతి సెలవులు

అలాగే కాంట్రాక్టు మహిళా ఉద్యోగినులకు ఇద్దరు పిల్లల వరకు 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేస్తున్నట్లు ఆర్థికశాఖ పేర్కొంది.

కెనడా ప్రధాని ట్రూడో రాజీనామా

7

'ఉక్కు' రక్షణకు చలో కలెక్టరేట్

- కూర్మన్నపాలెం నుంచి కార్మికుల బైక్ ర్యాలీ
- సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్

2

7

కుప్పం ఇక అన్‌స్టాపబుల్

- స్వర్ణ కుప్పం విజన్ ఆవిష్కరణలో చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'ఇక కుప్పం అభివృద్ధి అన్‌స్టాపబుల్' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంతో దశదిశ మారుస్తామని తెలిపారు. 'స్వర్ణకుప్పం విజన్ 2029'ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. యువతకు ఉద్యోగ ఉపాధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రినైనా, కుప్పంకు ఎంఎల్ఎనే అని, ఎనిమిది సార్లు ఎంఎల్ఎగా గెలిపించి ఆదరించిన కుప్పం ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనన్నారు. గత పాలకులు కక్షపూరితంగా కుప్పం అభివృద్ధిని అడ్డుకున్నారని, టిడిపి కార్యకర్తలను ఇబ్బందుల పాల్జేశారని అన్నారు. అన్ని రంగాల్లోనూ కప్పం నియో జకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే స్వర్ణకుప్పం విజన్ 2029 నిర్దేశించుకున్నామని తెలిపారు. కుప్పంలోని ప్రతి కుటుంబాన్నీ ఒక యూనిట్‌గా తీసుకుని, ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారుచేస్తామన్నారు. పరిశ్రమలు స్థాపించి, 15 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వంద శాతం సోలరైజేషన్, రహదారుల నిర్మాణం, జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటు చేయడం, కార్గో ఎయిర్‌పోర్టు పూర్తి చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం, అర్హులకు పింఛను, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, సూపర్ స్పెషాలిటీ ఏరియా ఆస్పత్రి నిర్మాణం, జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత నీరు, ఎలక్ట్రికల్ సైకిళ్లు, డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహకాలు అందిస్తామని, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతానని అన్నారు. జూన్ కల్లా హంద్రీనీవా జలాలను పాలారు వాగుకు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం, ద్రవిడ వర్సిటీలో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

'స్వర్ణకుప్పం విజన్ 2029' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

నడుమూరులో పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన

గుడిపల్లి మండలం నడుమూరులో పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు సుబ్రమణ్యం, నాగరాజు, పద్మావతి, చిన్నస్వామి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలు తెలుసుకుని 'టీ' స్వీకరించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియంకు చంద్రబాబు వెళ్లారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం రేంజి డిఐజి పి.షెమోషీ, ఎస్‌పి మణికంఠ చెందోలు, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, జెసి జి.విద్యాధరి స్వాగతం పలికారు. సోమవారం కార్యక్రమాల అనంతరం కుప్పం ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో రాత్రి బస చేశారు.

హెచ్‌ఎంపివి కలకలం

- భయం వద్దు, కొత్త వైరస్ కాదు : కేంద్ర ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ : భారత్‌లో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపివి) కేసులు వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఒక్కరోజే దేశంలో మూడు కేసులు నిర్ధారణ అయ్యాయి. కర్ణాటకలోని బెంగళూరులోని బాప్టిస్టు ఆస్పత్రిలో ఇద్దరు చిన్నారుల్లో ఈ వైరస్‌ను గుర్తించారు. వీరిలో ఒకరు 3 నెలలు, ఇంకొకరు 8 నెలల చిన్నారులు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మరో కేసు నమోదైంది. రాజస్థాన్‌లోని దుంగాపూర్‌కు చెందిన రెండు నెలలు శిశువుకు అహ్మదాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో హెచ్‌ఎంపివి పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగానే ఉంది. అలాగే హెచ్‌ఎంపివి వైరస్ సోకిన ముగ్గురు చిన్నారులకు ఎలాంటి అంతర్జాతీయ ప్రయాణాలు చేసిన సందర్భాలూ లేవు. దేశంలో హెచ్‌ఎంపివి కేసుల నమోదుపై కేంద్రం స్పందించింది. ఇది కొత్త వైరస్ కాదని కేంద్ర ఆర్యోగ మంత్రి జెపి నడ్డా తెలిపారు. 'హెచ్‌ఎంపివి కొత్త వైరస్ కాదని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేశారు. దీన్ని మొదటిసారిగా 2001లో గుర్తించారు. అనేక ఏళ్ల నుంచి ప్రపంచం మొత్తం వ్యాపిస్తోంది. ఇది అన్ని వయస్సుల వారిపై ప్రభావం కనబరుస్తుంది. శీతాకాలం, వసంత రుతువు ప్రారంభంలో వైరస్ ఎక్కువగా వ్యాప్తిస్తుంది' అని మంత్రి తెలిపారు.

కెవి రావు ఎవరో తెలియదు!

ఇడి విచారణలో విజయసాయి రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కాకినాడ పోర్టు సెజ్‌కు సంబంధించిన కేసులో వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయానికి వచ్చిన ఆయనను ఆరు గంటలపాటు అధికారులు ప్రశ్నించారు. వ్యాపారవేత్త కర్నాటి వెంకటేశ్వరరావు (కెవి రావు) నుంచి షేర్లను బలవంతంగా ఎందుకు లాక్కోవాల్సి వచ్చిందనే విషయంపైనే ఇడి అధికారులు తమ వద్ద ఉన్న ఆధారాలతో విజయసాయిరెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు విశ్వసనీయ సమాచారం. అయితే, కెవి రావు ఎవరో తనకు తెలియదని,షేర్లతో తనకు సంబంధం లేదని విజయసాయి రెడ్డి సమాధానమిచ్చినట్టు తెలిసింది. విచారణ అనంతరం మీడియాతో విజయసాయి రెడ్డి మాట్లాడుతూ, గతంలో కెవి రావు అనే వ్యక్తి తనపై చేసిన ఆరోపణలపైనే అధికారులు ప్రశ్నించారని చెప్పారు. కెవి రావు తనకు తెలియదని, ఆయనను ఇప్పటివరకు కలవలేదని తెలిపారు. 'కాకినాడ సీ పోర్టుపై కెవి రావుకు నేనెప్పుడూ ఫోన్ చేయలేదు. ఆయనను తిరుమల స్వామి వద్దకు రావాలని కోరుతున్నా. ఆయన ఫిర్యాదులు నిజమైతే వెంకటేశ్వరస్వామి ఎదుట చెప్పాలి. స్వామి సమక్షంలోనే నిజానిజాలు మాట్లాడుకుంటాం. మే నెలలోని కాల్ డేటా రికార్డ్స్‌ని తెప్పించండి. నేను కెవి రావుకు ఫోన్ చేసినట్లు తేలితే చేసిన తప్పును అంగీకరిస్తాను' అని అన్నారు. శరత్ చంద్రరెడ్డితో తనకు బంధుత్వమే తప్ప, వ్యాపార సంబంధాలు లేవని చెప్పారు. కెవి రావు ఇచ్చిన ఫిర్యాదు తప్పని తేలితే, అతడిపై పరువు నష్టం దావా వేస్తానని విజయసాయి రెడ్డి తెలిపారు.

మందుపాతర పేలిన ప్రాంతం

మందుపాతర పేలి 9మంది జవాన్ల మృతి

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా, కుత్రు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భద్రతా బలగాల వాహనాన్ని మందుపాతరతో పేల్చేశారు. ఈ ఘటనలో జిల్లా రిజర్వ్ గార్డ్(డిఆర్‌జి)కు చెందిన ఎనిమిది మంది జవాన్లు, ఒక డ్రైవర్ అక్కడికక్కడే కన్నుమూశారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. శక్తివంతమైన ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి)తో కూడిన మందుపాతరతో బలగాలు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనంపై ఈ దాడి జరిగినట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) సుందర్‌రాజ్. పి మీడియాకు తెలిపారు. కుత్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేలి గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం 2:15 గంటలకు ఈ ఘటన జరిగింది. ఘటన గురించి తెలియగానే భద్రతా బలగాలు అక్కడికి చేరుకుని సహాయక కార్యక్రమాలు ప్రారంభించాయి. ప్రమాద సమయంలో వాహనంలో 15 మంది జవాన్లు ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనలో వాహనం తునాతునకలైంది. పేలుడు ధాటికి రహదారిపై పది అడుగుల లోతులో భారీ గుంత పడింది. గాయపడినవారిని బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు దంతేవాడ, నారాయణ్‌పూర్, బీజాపూర్ సరిహద్దుల్లో పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్‌లో పాల్గొన్న డిఆర్‌జి సిబ్బంది తిరిగి వస్తుండగా, ఈ ప్రమాదం జరిగిందని సుందర్‌రాజ్ తెలిపారు.

అసత్యాల శంఖారావం...

సత్యాజీ

మూడు నెలలుగా చేసిన ప్రచారం, ప్రత్యక్షంగా బిజెపి అందించిన అధికారిక సహకారం, భక్తి పేరిట సామాన్యుల్లో కలిగించిన కదలిక .. వెరసి, ఆదివారం నాడు గన్నవరం దరి కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన హైందవ శంఖారావం పెద్ద జనసందోహం మధ్య జరిగింది. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ మతాలూ, శిబిరాలూ నిర్వహిస్తున్న స్వామీజీలు, సాధువులు వంద మందికి పైగానే వేదిక మీద ఆసీనులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం, సినిమా పాటల రచయిత అనంత్ శ్రీరామ్ లాంటి వాళ్లు వేదిక మీద నుంచి మాట్లాడారు. సాధారణంగా మతపరమైన సభలు హాజరైన వారి భక్తిప్రపత్తులను పెంచటానికో, నమ్మిన దేవుళ్లను, వారి బోధనలను స్మరించుకోవటానికో పరిమితమవుతాయి. ఈ 'హైందవ శంఖారావం' ఉద్దేశం అందుకు భిన్నమైనదని ఆ పేరులోనే స్పష్టంగా కనిపిస్తోంది. కాబట్టే, వచ్చిన వారిలో భక్తి ప్రపత్తులను పెంచటానికి కాకుండా ఇతర మతాల పైనా, వ్యవస్థలపైనా రెచ్చగొట్టే విధంగా వక్తలు తమ ప్రసంగాలు సాగించారు. హిందువులకు, హిందూ మతానికి ఇప్పటికిప్పుడు పెను ప్రమాదం ముంచుకొచ్చినట్టు, ఆ ప్రమాదం నుంచి హిందువులను రక్షించేందుకు తాము కంకణబద్ధులైనట్టు చెప్పుకొచ్చారు. దేవాలయాల నిర్వహణకు సంబంధించి స్వాతంత్య్రం తరువాత అమల్లోకి తెచ్చుకున్న చట్టాలను, విధి విధానాలను నిందిస్తూ మాట్లాడారు.

హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కావాలనేది ఈ శంఖారావం ప్రధాన డిమాండు. దీనిచుట్టూ ఇంకో 11 డిమాండ్లు ఉన్నాయి. వీటిని ముందుకు తెస్తూ, పలువురు స్వామీజీలు అనేక అసత్యాలను వల్లించారు. చిన జీయరు స్వామి మాట్లాడుతూ, ఎన్ని నిముషాలు పూజ చేయాలో అధికారులే నిర్ణయిస్తే ఎలాగ? అంటూ ప్రశ్నించారు. దేవాలయాల్లో పూజలు, ఇతర కార్యకలాపాలకు సంబంధించి ఎక్కడా అధికారులు జోక్యం చేసుకోరు. ఆగమశాస్త్రమూ, స్థానిక సాంప్రదాయాలను బట్టి నిత్య సేవితాలు జరుగుతాయి. ఇతరత్రా సదుపాయాలను, ఏర్పాట్లను మాత్రమే ఆయా ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులూ చూడడం చాలా కాలంగా వస్తోంది. దాదాపుగా ఇది రాజులు, జమిందార్ల కాలం నాటి పద్ధతే! అప్పుడైనా, ఇప్పుడైనా పోషణ, పర్యవేక్షణ పాలకులదే.

1987లో జస్టిస్ చల్లా కొండయ్య కమిషన్ చేసిన సిఫార్సుల కారణంగానే హిందూ దేవాలయాలకు ఈ దుస్థితి దాపురించినట్టుగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం వక్కాణించారు. వాస్తవానికి ఆనాడు దేవాలయాల్లో నెలకొని ఉన్న అస్తవ్యస్త పరిస్థితులను సరిదిద్దటానికి ఎన్టీఆర్ ప్రభుత్వం జస్టిస్ చల్లా కొండయ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. జస్టిస్ చల్లా కొండయ్య 1979 - 80 మధ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఆయన హయాంలో అనేక ప్రజోపకరమైన తీర్పులు వచ్చాయనే పేరుంది. ఎమర్జెన్సీ కాలంలో అక్రమ బనాయించిన అనేక కేసులను ఆయన కొట్టేశారు. రూ.12 కోట్ల నిజాం నగల కేసు విషయంలో మార్గదర్శకాలను రూపొందించారు. దేవదాయ ధర్మదాయ కమిషన్ ఛైర్మన్‌గా... దేవాలయాల ఆస్తుల పరిరక్షణ, నిర్వహణపై ప్రభుత్వానికి పలు నిర్మాణాత్మక సూచనలు చేశారు. వాటి ఆధారంగా ఎన్టీఆర్ ప్రభుత్వం 1987లో దేవాదాయ చట్టాన్ని చేసింది. దేవాలయాల్లో వారసత్వ హక్కును రద్దు చేసింది. తిరుమల దేవస్థానంలో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించింది. మిరాశీ పేరుతో తిరుమల లడ్డూ ఆదాయం వ్యక్తులకు చేరకుండా అడ్డుకట్ట వేసింది. దేవాలయాలకు వచ్చే ఆదాయాన్ని ఒక క్రమపద్ధతిలో వినియోగించటానికి వీలైన మార్పులు ఈ చట్టం ద్వారా వచ్చాయి. ఆ చట్టమే దేవాలయాలకు పెద్ద అడ్డంకి అని ఎల్‌వి సుబ్రహ్మణ్యం పేర్కొనటం ఎవరి ప్రయోజనాల కోసం?

సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ, 75 ఏళ్ల సినీరంగం మొత్తం మీద విమర్శలు ఎక్కుపెట్టేశారు. తన తాజా రాతలపై తలెత్తిన విమర్శలను సైతం మరచిపోయి, గతించిన సినీ పెద్దలకు కూడా సుద్దులు చెప్పే సాహసానికి తెగించాడు. కర్ణుడి పాత్రను ఉదాత్తంగా తీర్చిదిద్దటాన్ని ఎద్దేవా చేశారు. తెలుగు నాట పౌరాణిక చిత్రాలను రూపొందించిన పెద్దలు కొన్ని సినిమాల్లో వర్తమాన జీవితానికి దోహదపడేలా సన్నివేశాలకు రూపకల్పన చేశారు. కాబట్టే మాయాబజార్, దానవీర శూరకర్ణ వంటి సినిమాలు ఎప్పుడు చూసినా ఆ సంభాషణల్లో, సన్నివేశాల్లో వర్తమానీయత గోచరిస్తుంది. 'దానవీర శూరకర్ణ' సినిమాలో పుట్టుక కారణంగా కర్ణుడిని ద్రోణాచార్యుడు హీనంగా మాట్లాడినప్పుడు- దుర్యోధనుడు పాత్రధారి, మహానటుడు ఎన్టీఆర్ చెప్పిన డైలాగులు ఇప్పటికీ కరతాళధ్వానాలు అందుకుంటాయి. వ్యాసభారతంలోని మిగతా 7లో

'ఉక్కు' రక్షణకు చలో కలెక్టరేట్

- కూర్మన్నపాలెం నుంచి కార్మికుల బైక్ ర్యాలీ
- సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. తొలుత కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం మీదుగా భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బీచ్ రోడ్డులో వాహనాలను విడిచిపెట్టి అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కును అమ్మే హక్కు ఎవరికీ లేదు, ప్రభుత్వ రంగంలోనే కర్మాగారాన్ని కొనసాగించాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారాన్ని పోలీసులు మూసివేశారు. దీంతో నిరసనకారులంతా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్, చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, నాయకులు వైటి.దాస్, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, కె.దాలినాయుడు, దొమ్మేటి అప్పారావు, సిఐటియు నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా

బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు కార్మికులు

అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, ఎం. రాజశేఖర్, డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. ఉక్కు ఉద్యోగులకు నాలుగు నెలల జీతం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ఆర్థిక వనరులు సమకూర్చాలని, మూడు సంవత్సరాలపాటు ట్యాక్స్ హాలీడే ఇవ్వాలని కోరారు. జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురై మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇఎంఐలు, పిల్లల ఫీజులు కట్టలేక డిఫాల్టర్స్‌గా మారుతున్నారని తెలిపారు. ప్లాంట్ ఉత్పత్తి నూరు శాతం దాటి వస్తున్నప్పటికీ ఉత్పత్తిలో పాల్గొన్న ఉద్యోగులకు యాజమాన్యం వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పిఎఫ్, ఎస్ఎబిఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీ బకాయిలను, ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం కింద ఇవ్వవలసిన డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిలుపుదల చేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం జెసి మయూర్ అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేయాలి

ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ.. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. జెఎసి సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగింది. చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు భోగవిల్లి నాగభూషణం, ఎం.మన్మథరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలోని అన్ని కార్మిక కేంద్రాలు, పరిశ్రమల వద్ద నిరసనలు చేపట్టాలని, బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని, 8న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఈ సమావేశం నిర్ణయించింది.

వైరస్‌పై అప్రమత్తం

- టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ఆదేశం
- ప్రొఫెసర్లతో నిపుణుల కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్, ఇన్‌ఫ్లూయెంజా లైక్ ఇన్‌ఫెక్షన్ కేసులపై వైద్యశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. హెచ్ఎంపివి వైరస్ పట్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత రాష్ట్రంలో ఏమీ లేదని, ఒకవేళ ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలను సిఎం ఆదేశించారు. కుప్పం నుంచి సోమవారం హెచ్ఎంపివి సన్నద్ధత, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై సిఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమికంగా జర్మనీ నుంచి 3 వేల పరీక్షా సామర్థ్యం కిట్లను అవసరమైతే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎపిఎంఎస్ఐడిసి ద్వారా మందుల నిల్వలు సరఫరా చేయబడే వరకు అవసరమైన సందర్భాల్లో రిబావిరిన్ వంటి ప్రత్యేక మందులను స్థానికంగా కొనుగోలు చేయాలని వైద్యాశాఖాధికారులను ఆదేశించారు. అన్ని ఆస్పత్రుల్లో నిరంతరాయమైన ఆక్సిజన్ సరఫరా, ఆక్సిజన్ పైప్‌లైన్లు, లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా, పిఎస్ఎ ప్లాంట్ల లభ్యతను నిర్ధారించుకోవడానికి మాక్ డ్రిల్ నిర్వహించాలని సిఎం సూచించారు. ప్రస్తుతానికి సాంకేతిక సలహాలు అందించడానికి, తదుపరి నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలకు మైక్రో బయాలజిస్టు, పీడియాట్రీషియన్లు, పల్మనాలజిస్టులతో టాస్క్‌ఫోర్స్ నిపుణుల కమిటీ ఏర్పాటు చేసినట్లు సిఎం దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సిహెచ్‌డబ్ల్యుఎఫ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులకు సంక్రాంతి సందడి తెచ్చాం

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నామని, ఫలితంగా రైతుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం సంక్రాంతి సందడి తెచ్చిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 4,15,066 మంది రైతుల నుంచి27లక్షల మెట్రిక్ టన్నులు ఖరీఫ్‌లో ధాన్యం సేకరించామని వైసిపి హయాంలో కేవలం 2లక్షల మంది రైతుల నుంచే ధాన్యం కొన్నారన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ.6,083.69 కోట్లు జమ చేశామన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

పెంపుదల లేదంటూనే భారాలు

- విద్యుత్ ఛార్జీలపై సిపిఎం ఆందోళన
- నేటి విచారణలో అభ్యంతరాలు తెలుపుతామని ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీల పెంపుదల లేదంటూనే రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎపిఇఆర్‌సికి డిస్కమ్‌లు సమర్పించిన 2025-26 వార్షిక ఆదాయ అవసర నివేదికలను (ఎఆర్ఆర్)పై సిపిఎం రాష్ట్ర కమిటీ పలు అభ్యంతరాలు తెలుపుతూ డిసెంబర్ 21, 27, 28 తేదీల్లో 33 పేజీలతో కూడిన పత్రాలను ఎపిఇఆర్‌సికి రాతపూర్వకంగా పంపిన అభిప్రాయాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఎపిఇఆర్‌సి, ప్రభుత్వం డిస్కమ్‌ల ప్రతిపాదనలను గుడ్డిగా ఆమోదించడం, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం బాధాకరమని పేర్కొంది. ఇప్పటికైనా గతంలో వేసిన భారాలు రద్దు చేయాలని, కొత్త భారాలు వేయొద్దని డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని, అదాని సంస్థతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరింది. 2025-26లో భారాలు లేవంటూనే సర్దుబాటు ఛార్జీల ద్వారా వేలాది కోట్ల రూపాయల భారం ముందుగానే మోపారని, భవిష్యత్తులో కూడా మరింతగా మోపటానికి సిద్ధమవుతున్నారని పేర్కొంది. డిస్కమ్‌లు.. విద్యుత్ మిగులు, భవిష్యత్తు అవసరాలపై తప్పుల తడకలతో అంచనాలు రూపొందిస్తున్నాయని, 2024-25లో సంస్థల ప్రతిపాదనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అనుభవం తెలిపిందని పేర్కొంది. బడా కంపెనీలకు మేలు చేసే విధంగా ప్రైవేట్ సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు అంచనాలు రూపొందిస్తున్నాయని విమర్శించింది. ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీలను కుదించేసి భవిష్యత్తులో సర్దుబాటు ఛార్జీలపై భారం మోపటానికి వాస్తవ విరుద్ధ ప్రతిపాదనలు ప్రజల ముందు ఉంచుతున్నారని పేర్కొంది. కార్పొరేటర్లకు మేలు చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, చర్యల వల్ల ప్రజలపై విద్యుత్ భారాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పునరుత్పాదక విద్యుత్ (ఆర్ఇ) పేరుతో అధిక ధరలతో అవసరానికి మించి విద్యుత్ కొనుగోలు చేయటం వల్ల వేలాది కోట్ల రూపాయల భారం పడుతుందని తెలిపింది. ఆర్ఇ పేరుతో ప్రభుత్వ విద్యుదుత్పత్తి సంస్థల్లో విద్యుత్ ఉత్పాదనలో కోత పెట్టి వాటిని దెబ్బతిస్తున్నారని పేర్కొంది. మరోవైపు స్వల్పకాలిక కొనుగోళ్ల పేరుతో రూ.వేలాది కోట్లు బడా కంపెనీలకు కట్టబెడుతూ ప్రజలపై దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీలు పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. అధిక ధరలకు ప్రైవేట్ విద్యుత్ సంస్థలతో చేసుకున్న దీర్ఘకాలిక పిపిఎలు తీవ్ర హాని చేస్తున్నాయని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగి గత రాష్ట్ర ప్రభుత్వం సెకి ద్వారా అదాని సంస్థల నుంచి సోలార్ విద్యుత్ కొనుగోలు చేసే దీర్ఘకాలిక ఒప్పందం చేసుకోవడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేసింది. గత ప్రభుత్వంలోని పెద్దలకు రూ.1,750 కోట్ల ముడుపులు ఇచ్చి అధిక ధరకు పాతికేళ్ల సోలార్ విద్యుత్ సరఫరా చేసే ఒప్పందాలు అక్రమమని, అవినీతిమయమని, అమెరికా కోర్టుల్లో సాక్షాధారాలతో కేసులు నమోదయ్యాయని వివరించారు. అయినా కూటమి ప్రభుత్వం ఈ ఒప్పందాలను రద్దు చేయకుండా కొనసాగించడం శోచనీయమని తెలిపింది. ఎపిఇఆర్‌సి ఈ ఒప్పందాన్ని రద్దు చేసి బహిరంగ విచారణ జరిపి తాజాగా టెండర్లు పిలవాలని కోరింది. అదాని, ఇతర కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగి వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలు, చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థల వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి పూనుకోవడం ప్రజావ్యతిరేకమని తెలిపింది. పారదర్శకత లేకుండా గోప్యంగా బహిరంగ విచారణ కూడా జరపకుండా స్మార్ట్ మీటర్లకు అనుమతి ఇవ్వటం తీవ్ర అభ్యంతరకరమని, వినియోగదారుల ఆమోదం లేకుండా ఏకపక్షంగా మీటర్లు బిగించడం చట్ట విరుద్ధమని తెలిపింది. డిస్కమ్‌ల ప్రతిపాదనలపై ఈ నెల 7, 8, 10 తేదీల్లో విజయవాడ, కర్నూలులో ఇఆర్‌సి నిర్వహించే బహిరంగ విచారణలో తమ పార్టీ ప్రతినిధులు పాల్గొని అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలపనున్నారని వెల్లడించింది.

రియల్ ఎస్టేట్ కోసం నిబంధనలు సరళతరం

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి అనుగుణంగా నిబంధనలను సరళతరం చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడలోని రెరా కార్యాలయంలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సోమవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న మంత్రి నారాయణ మాట్లాడుతూ.. భవనాలు, ప్లాట్లు కొనుగోలు చేసేవారు ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండేలా చూడటమే రెరా లక్ష్యమన్నారు. కేంద్ర చట్టం ప్రకారం రాష్ట్రంలో 2016లో రెరా చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి కేంద్రం సూచించిన నిబంధనలను పగడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. రెరాలో ఇప్పటి వరకూ 167 దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కారణంతోనే స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించామన్నారు. 30 మంది క్లయింట్లు, బిల్డర్లు, డెవలపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారని, ఆయా దఖాస్తులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశామని చెప్పారు.

పెండింగ్ అప్లికేషన్లు అన్నీ ఈ నెలాఖరులోగా క్లియర్ చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన విధానాలను కూడా కొన్ని పరిశీలించామని, రెరా నిబంధనలు మరింత సరళతరం చేసేలా కమిటీ వేయనున్నట్లు చెప్పారు. రెరా అనుమతులను త్వరలో ఆన్‌లైన్‌లో ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భవన నిర్మాణాలకు సంబంధించి కొత్తగా రూపొందించిన నిబంధనలను గురువారం విడుదల చేస్తామన్నారు. తణుకు, తిరుపతి పట్టణాల్లో టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరగడంతో, రాష్ట్ర వ్యాప్తంగా కొన్నాళ్లుగా అన్ని చోట్ల బాండ్ల జారీ నిలిపివేశామన్నారు. తాజాగా రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్ల పెండింగ్‌లో ఉన్న టిడిఆర్ బాండ్లను త్వరలోనే జారీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెరా ఛైర్మన్ కన్నబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్‌పై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- నేడు, రేపు విజయవాడలో, ఎల్లుండి కర్నూలులో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై మంగళవారం నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆధ్వర్యాన ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో, 10వ తేదీన కర్నూలులో జరగనుంది. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్ అధ్యక్షతన విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్‌లో వ్యక్తిగతంగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించనున్నారు. కర్నూలులో ఎపిఇఆర్‌సి కార్యాలయం నుంచి 10వ తేదీన ఆఫ్‌లైన్‌లో జరగనుంది. మూడు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలను పరిశీలించాక ఎపిఇఆర్‌సి మార్చి 31లోపు విద్యుత్ టారిఫ్ ప్రకటిస్తుంది. ఈ టారిఫ్ ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తుంది.

రతన్ టాటా గొప్ప విజనరీ

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - కాళ (పశ్చిమ గోదావరి జిల్లా)

దేశాభివృద్ధిలో రతన్‌టాటా కీలకపాత్ర వహించారని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెదఅమిరంలో సోమవారం రతన్ టాటా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రతన్‌టాటా మార్గ్‌గా నామకరణం చేసిన భీమవరం-ఉండి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఒక వ్యాపార వేత్తగా కంట్రీ ఫస్ట్ అనే నినాదానికి కట్టుబడి చివరి వరకు పనిచేసిన ఘనత రతన్ టాటాకే దక్కుతుందన్నారు. భారతీయ కంపెనీల సమర్థతను ప్రపంచానికి చాటిన గొప్ప పారిశ్రామికవేత్త అని, గొప్ప విజనరీ అని కొనియాడారు. బసవతారకం కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు 1992లో రతన్‌టాటా రూ.25 కోట్లు విరాళం ఇచ్చారని, 2014 హుదూహుద్ తుపాను సమయంలో టాటా ట్రస్ట్ సిఇఒకు తాను ఫోన్ చేస్తే 30 సెకన్లలో రూ.మూడు కోట్లు సమకూర్చారని గుర్తుచేశారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్రంలో ప్రజా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసి యువతకు మెరుగైన నెట్‌వర్కింగ్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకున్న మంత్రి లోకేష్ వర్చువల్ విధానంలో పెదఅమిరంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన ఫిల్టర్‌బెడ్‌ను ప్రారంభించారు. లోకేష్‌ను ఆ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. దీనికి ముందు మండల కేంద్రమైన ఉండిలో పున:నిర్మించిన జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని తరగతి గదుల భవనాలను, క్రీడా ప్రాంగణాన్ని లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు అడిగిన దానిపై స్పందించి హైస్కూల్ ప్లస్ విధానాన్ని అభివృద్ధి చేసే దిశగా వెళ్తున్నామని, అంతేతప్ప హైస్కూల్ ప్లస్ విధానాన్ని రద్దు చేసే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, శాసనసభ డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, రాష్ట్ర ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, ఎపి ఎస్‌సిపిసి చైర్‌పర్సన్ పీతల సుజాత, జిల్లా కలెక్టర్ సి నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, జడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

పెదఅమిరంలో దివంగత రతన్ టాటా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్

రూ.వెయ్యి కోసం స్నేహితుల మధ్య తగాదా

- ఒకరు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)

వెయ్యి రూపాయల కోసం ఇద్దరు స్నేహితుల మధ్య తలెత్తిన వివాదం చివరికి హత్యకు దారితీసింది. ఈ సంఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని ఎరుకొండ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలపిన వివరాల మేరకు... ఎరుకొండకు చెందిన గొర్రెల నవీన్ (21), బొంతు అప్పలనాయుడు స్నేహితులు. ఇద్దరూ కార్మికులు. ఆదివారం గ్రామంలో ఓ ఇంటికి పెయింటింగ్ వేసి, పని పూర్తయ్యాక సాయంత్రం ఇద్దరూ కలిసి పూటుగా మద్యం తాగారు. రాత్రి పది గంటల సమయంలో స్నేహితుల మధ్య రూ.వెయ్యి డబ్బుల కోసం ఘర్షణ మొదలైంది. ఘర్షణ అనంతరం తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న నవీన్‌పై బైక్‌పై వచ్చిన అప్పలనాయుడు వెనుక నుంచి నవీన్‌పై పడ్డాడు. నవీన్ ఇంటి ముందే ఇద్దరూ ఘర్షణపడ్డారు. తన వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్ ఛాతిపై, కడుపులో అప్పలనాయుడు పొడిచాడు. బయట ఘర్షణ జరుగుతుండడంతో ఇంట్లో నుంచి నవీన్ తల్లి వచ్చి చూడగా ఆమె చేతిలో కుమారుడు ప్రాణం విడిచాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సిహెచ్‌సి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

పిఆర్ఎస్ఐ అమరావతి చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ), అమరావతి చాప్టర్ నూతన ఛైర్మన్‌గా జి అనిత ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన పిఆర్ఎస్ఐ అమరావతి చాప్టర్ సర్వసభ్య సమావేశంలో జరిగిన ఎన్నికల్లో అనితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి వై బాబ్జీ సోమవారం ప్రకటించారు. వైస్ ఛైర్మన్‌గా జె రాజేంద్ర కుమార్, కార్యదర్శిగా కందాడై పార్థసారథి, సంయుక్త కార్యదర్శిగా పి బషీర్, కోశాధికారిగా ఒలివా ఎరమల, కార్యవర్గ సభ్యులుగా మధురవాణి, రవిశంకర, ఎస్ సుశీల్ కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా టైటస్ నిర్మల్ కుమార్, ఈ కమిటీకి సలహాదారుగా విఎస్ఆర్ నాయుడు నియమితులయ్యారు. అనంతరం నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిత మాట్లాడుతూ.. భవిష్యత్తులో పిఆర్ఎస్ఐను జర్నలిజం కోర్సు చదువుతున్న విద్యార్థులకే కాకుండా మేనేజ్‌మెంట్, ఇతర సబ్జెక్టు విద్యార్థుల చెంతకు చేర్చడానికి కృషి చేస్తామని చెప్పారు. కమ్యూనికేషన్స్ కీలకంగా మారుతున్న ఈ రోజుల్లో విద్యార్థులకు కమ్యూనికేషన్స్, పబ్లిక్ రిలేషన్స్ అవశ్యకతను వివరించడంతోపాటు వారిని ఇందులో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు కళాశాలలో పిఆర్ క్లబ్‌లను స్థాపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

టిడిపి కార్యాలయంపై దాడి కేసులో పిటిషన్ల కొట్టివేత...

ప్రజాశక్తి-గన్నవరం

కృష్ణా జిల్లా గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో నిందితులు ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్లను సోమవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో 17 మంది నిందితులు ముందస్తు బెయిల్‌కు ధర్మాసనంలో పిటిషన్లు వేశారు. కోర్టు రెండు నెలలుగా వాయిదాలు అనంతరం పిటిషన్లను కొట్టి వేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 89 మందిని నిందితులుగా పోలీసులు చేర్చారు. ఇదే కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఉన్న సంగతి తెలిసిందే.

కుమార్తెలను కాటేసిన కామాంధుడు

- భర్త అఘాయిత్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య

ప్రజాశక్తి-నిమ్మనపల్లె (అన్నమయ్య జిల్లా)

అల్లారుముద్దుగా పెంచి అందమైన జీవితాన్ని ఇవ్వాల్సిన తండ్రే తన ఇద్దరు ఆడపిల్లలపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అన్నమయ్య జిల్లా, నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లి శివాజీ నగర్‌లో ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివాజీనగర్‌కు చెందిన దంపతులకు కొడుకు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసై మూడు రోజుల క్రితం పెద్ద కుమార్తెపై, మరుసటి రోజు రెండవ కుమార్తెపై తండ్రి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మూడవరోజు తన ఏడేళ్ల కూతురిపై అఘాయిత్యానికి పాల్పడానికి తీసుకెళ్తుండగా, అత్త గమనించి నిలదీయడంతో కుమార్తెను వదిలేశాడు. నొప్పి ఉందని ఏడుస్తూ తమ బాధను అమ్మమ్మకు, మేనమామకు చిన్నారులు చెప్పుకొచ్చారు. వారు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. కన్న బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడుతున్న కీచక తండ్రిపై పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. కూతుళ్లపై తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమగ్ర భూపంపిణీతోనే సమస్యలు పరిష్కారం

- అన్నే వర్ధంతి సందర్భంగా 'భూమి కోసం' సదస్సులో ఎపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వాలు ఎన్ని పథకాలు, చిట్కాలు చేపట్టినా గ్రామీణ పేదల సమస్యలు పరిష్కారం కావని, సమగ్ర భూపంపిణీ ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు 21వ వర్ధంతి సందర్భంగా 'భూమి కోసం' పేరిట నిర్వహించిన స్మారక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సదస్సుకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 29 లక్షల ఎకరాలకుపైగా అసైన్డ్ ప్రభుత్వ భూములున్నాయని, వాటిని సంపన్నులకు కట్టబెట్టడానికే భూఆక్రమణ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. కిలో రూ.రెండు బియ్యం పథకం ప్రవేశపెట్టి 40 ఏళ్లు గడిచినా నేటికీ వాటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందంటే పేదరికం సమసిపోలేదనేది అర్థమవుతోందన్నారు. భూమి భిక్షగా కోరితే దక్కదని, పోరాడితేనే సాధించుకోగలమని నాడు పుచ్చలపల్లి సుందరయ్య, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చెప్పారని వివరించారు. వారి బాటలోనే అమరజీవి, స్వాతంత్ర సమరయోధుడు వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకుడు అన్నే వెంకటేశ్వరరావు, ఆయన భార్య అనసూయమ్మ తమ జీవితాలను ప్రజల హక్కుల కోసం, భూసాధన కోసం అంకితం చేశారని కొనియాడారు. ప్రభుత్వ భూములను గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొల్లగొట్టారని విమర్శిస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం.. రిలయన్స్‌కు కోరిన చోట ఐదు లక్షల ఎకరాల వరకు కట్టబెట్టడానికి ఎలా ముందుకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రభుత్వ అసైన్డ్, సీలింగ్, బంజర భూముల సాధన కోసం పేదలు ఐక్యంగా పోరాడాలని, తద్వారానే అన్నే ఆశయాలు సాధించగలమని కోరారు. అన్నే దంపతులు తమ కోసం కాకుండా దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజల హక్కుల కోసం, భూమి కోసం పోరాటాలు సాగించి ఏళ్ల తరబడి జైల్లో మగ్గారని సభాధ్యక్షులు ఎ.రవి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల పోరాటాలకు కార్మికులు అండగా నిలుస్తారని సిఐటియు జిల్లా కార్యదర్శి అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. సదస్సులో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. తొలుత అన్నే వెంకటేశ్వరరావు చిత్రపటానికి నేతలంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నే వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

శ్రీవారి యాత్రికులపై దూసుకెళ్లిన అంబులెన్స్

- ఇద్దరు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చంద్రగిరి

ప్రమాదానికి గురైన వ్యక్తుల ప్రాణాలను కాపాడే 108 అంబులెన్స్ పొగమంచు కారణంగా సోమవారం తెల్లవారుజామున తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యాత్రికులు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. చంద్రగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గుండెపోటుకు గురైన రోగిని ఎక్కించుకొని మదనపల్లి నుండి 108 వాహనం తిరుపతి రుయా ఆస్పత్రికి బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున చంద్రగిరి మండలం, ఏ రంగంపేట సమీపంలో నర్సింగాపురం జాతీయ రహదారి వద్ద తిరుమలకు శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్తున్న వారిపైకి వాహనం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలానికి చెందిన పెద్ద రెడ్డమ్మ (40), లక్ష్మమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందారు.

మరో ఐదుగురు కె రెడ్డెమ్మ, వి రెడ్డెమ్మ, యశోద, తులసమ్మ, రమేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసుల సమాచారంతో ఆస్పత్రికి చేరుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారిని దర్శించుకునేందుకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారని వారి బంధువులు బోరుమని విలపించారు. యాత్రికులను ఢీకొన్న 108 అంబులెన్స్‌లోని గుండెపోటు రోగిని మరో 108 వాహనం రప్పించి రుయా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు పోలీసులు తరలించారు. తీవ్ర గాయపడిన తులసమ్మ పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. నలుగురు క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి బాగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని రుయా వైద్యులకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఫోన్ ద్వారా కోరారు.

అక్కాచెల్లెళ్ల సజీవదహనం

- కుమార్తెలను కాపాడే క్రమంలో తీవ్ర గాయాలపాలైన తల్లి

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగి అక్కాచెల్లెళ్లు సజీవ దహనమైన ఘటన బాపట్ల జిల్లా పర్చూరులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పర్చూరులోని తూర్పు బజారు రామాలయం సమీపంలో దాసరి వెంకటేశ్వర్లు, లక్ష్మీరాజ్యం కుటుంబం నివాసముంటోంది. వెంకటేశ్వర్లు స్థానిక లారీ ఆఫీసులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు దాసరి నాగమణి (34), దాసరి మాధవీలత (30), ఒక కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు.

పక్షవాతంతో బాధపడుతూ నాగమణి మంచంలోనే ఉంది. చిన్న కూతురు మాధవీలత ఫిట్స్ వ్యాధితో ఇబ్బంది పడుతూ ఇంట్లోనే ఉంటున్నారు. కుమార్తెలిద్దరికీ వివాహం కాలేదు. కుమారుడు శ్రీనివాసరావు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి, కుమారులిద్దరూ డ్యూటీకి వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంటిలో మంటలు వ్యాపించాయి.

లక్ష్మీరాజ్యం మెలకువ వచ్చి పెద్దగా కేకలు వేసింది. తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటల్లో చిక్కుకున్న కుమార్తెలను కాపాడేందుకు లక్ష్మీరాజ్యం ప్రయత్నించి, తీవ్ర గాయాలపాలయ్యారు. మంటల్లో చిక్కుకొని నాగమణి, మాధవీలత సజీవ దహనమయ్యారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లక్ష్మీరాజ్యంను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.

ఎపి పేపర్‌మిల్లు లాకౌట్

- ఆందోళనకు దిగిన కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని ఎపి పేపరు మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. ఆ సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అక్కినేని జయకృష్ణ పేరు మీద సోమవారం ఉదయం ఆరు గంటలకు పేపరుమిల్లు ప్రధాన గేటుకు లాకౌట్ నోటీసు అంటించారు. దీంతో ఎ-షిఫ్టుకు వచ్చిన కార్మికుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇతర కార్మికులకు సమాచారం అందించారు. అందరూ కలిసి పేపరు మిల్లు వద్ద ఆందోళన చేపట్టారు. అప్పటికే పోలీసులు పెద్ద సంఖ్యలో మిల్లు వద్దకు చేరుకుని గేట్లకు అడ్డుగా నిలబడ్డారు. ఒక దశలో పోలీసులకు కార్మికులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఏడేళ్లుగా నిలిచిన వేతన ఒప్పందం చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. కార్మికుల సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ వేస్తామని ఈ నెల మూడున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ తరుణంలో కనీస సమాచారం లేకుండా లాకౌట్ ప్రకటించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. జాయింట్ కలెక్టరు చిన్నరాముడు, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ వలి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, పేపరు మిల్లు యాజమాన్యంతో చర్చలు జరిపి వెనుతిరిగారు. చర్చల సారాంశాన్ని ప్రకటించకపోవడంతో కార్మికులు తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. పేపరుమిల్లులో 728 మంది పర్మినెంట్ కార్మికులు, సుమారు రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. 1972 నుంచి 2019 వరకు 14 వేతన ఒప్పందాలు జరిగాయి. కార్మికుల కష్టంతో ఫ్యాక్టరీ రూ.1,300 కోట్ల లాభాల్లో ఉంది. అయినా యాజమాన్యం కార్మికులకు వేతన ఒప్పందం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

పలుమార్లు చర్చలు విఫలం

యాజమాన్యంతో పలుమార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. గతేడాది మార్చిలో 22 రోజుల పాటు కార్మికులు సమ్మె చేపట్టారు. ఆ సందర్భంగా అప్పటి కలెక్టర్ మాధవీలత అధ్యక్షతన జరిగిన చర్చల్లో మూడు వారాల్లో సమస్య పరిష్కరిస్తామని యాజమాన్య ప్రతినిధులు హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. అప్పటి నుంచి దశల వారీగా అనేక చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. నాలుగు నెలల క్రితం కార్మికులు, అధికారులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మికశాఖ కమిషనర్లతో మంత్రి కందుల దుర్గేష్ సమావేశం నిర్వహించారు.

పేపరుమిల్లు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

మిల్లు కార్మికులకు రూ.10,500 వరకూ వేతనం పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సమావేశానికి హాజరైన మిల్లు ఇడి ముఖేష్ జైన్ రూ.3,250 మాత్రమే కార్మికులకు పెంచుతామని చెప్పారు. దీన్ని కార్మికులు వ్యతిరేకించారు. గత నెల డిసెంబర్ 24న తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ఎంపి పురంధేశ్వరి, మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ల సమక్షంలో మిల్లు కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో మరోసారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇడి ముఖేష్ జైన్ పాల్గొనలేదు. ఆయన తరపున హాజరైన ప్రతినిధులు హాజరై కేవరం రూ.3,500 మాత్రమే వేతనం పెంచుతామని ప్రకటించారు. దీనిని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి.

బలవంతపు భూసేకరణపై దశలవారీ ఆందోళనలు

- కార్గో ఎయిర్‌పోర్టు ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేయాలి
- 23న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష
- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వామపక్షాల ధర్నా

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - పలాస

కార్గో ఎయిర్‌పోర్టు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా దశల వారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తూ వామపక్షాలు, పోరాట కమిటీ ఆధ్వర్యంలో పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ జిల్లా నాయకులు చాపర వేణు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిలి రామారావు, కార్గో ఎయిర్‌పోర్టు భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్టు బలవంతపు భూసేకరణ ప్రతిపాదన ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపడతామని తెలిపారు. ప్రజల ఆస్తులను బలవంతంగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి, వారిని నిరాశ్రయులను చేయడం అభివృద్ధి ఎలా అవుతుందో చెప్పాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. పాలకులు కార్పొరేట్ కంపెనీల పక్షమా, ప్రజల పక్షమా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి ముసుగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నాయని విమర్శించారు. మూలపేట పోర్టుకు కేటాయించిన 2,279 ఎకరాల్లో కార్గో ఎయిర్‌పోర్టుకు 300 ఎకరాలు కేటాయిస్తే చాలని, ఎటువంటి భూసేకరణా అవసరం లేదని వివరించారు. ధర్నా అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె మోహనరావు, ఎన్ గణపతి, కె కేశవరావు, టి అజయ్ కుమార్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, జె వీరాస్వామి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి శ్రీనివాస్, పి కుసుమ, పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కడప జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్

- 16 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎం కడప జిల్లా నూతన కమిటీ 16 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా జి.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. కడపలోని సీతారాం ఏచూరి నగర్ (అజ్మత్ కల్యాణ మండపం)లో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా 12వ మహాసభ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్ ఎన్నికయ్యారు. .

జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

క్రిస్టల్ క్రాప్ చేతికి బేయర్ ఇథోక్సిసల్ఫ్యూరన్

న్యూఢిల్లీ : బేయర్ ఎజికి చెందిన ఇథోక్సిసల్ఫ్యూరాన్‌ను కొనుగోలు చేసినట్లు క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ వెల్లడించింది. 2021లో ఇండియన్ కాటన్, పెరల్ మిల్లెట్, మస్టర్డ్ సీడ్ పోర్టుపోలియోను కొనుగోలు చేసిన తర్వాత బేయర్ నుంచి రెండో అతిపెద్ద కొనుగోలుగా నిలువనుందని క్రిస్టల్ క్రాప్ పేర్కొంది. దీంతో వరి కలుపునాశిని మార్కెట్‌లో తమ రాబడులను 20 శాతం పెంచొచ్చని అంచనా వేసింది. ఎథోక్సిసల్ఫ్యూరాన్ వరి, తృణధాన్యాల పంటలలో విస్తృత ఆకు జాతి కలుపు మొక్కలు, తుంగను సమర్థవంతంగా నియంత్రించడంలో కీలక గుర్తింపును కలిగి ఉందని క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ ఎండి అంకూర్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ స్వాధీనంతో భారత్ సహా దక్షిణాసియా, అగ్నేయాసియా రైతులకు మెరుగైన వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు.

షెడ్యూల్ మార్పుతో ప్రయాణికుల్లో గందరగోళం

- రాజమండ్రిలో మూడు గంటలు నిలిచిపోయిన షిరిడి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి - సామర్లకోట, రాజమహేంద్రవరం

షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ మార్పు.. ప్రయాణికులను గందరగోళానికి గురిచేసింది. ఈ నెల ఒకటి నుంచి షిరిడి సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకల్లో మార్పులు చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టు నుంచి సాయి నగర్ షిరిడి ఎక్స్‌ప్రెస్ సోమవారం గంట ముందుగా ఉదయం ఐదు గంటలకే కాకినాడ నుంచి బయలుదేరింది. ఆరు గంటలకు వెళ్లాల్సిన రైలు గంట ముందుగా సామర్లకోట దాటి వెళ్లిపోయింది. ఆయా స్టేషన్లలోని ప్రయాణికులు తాము వచ్చేసరికి రైలు వెళ్లిపోయిందని రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రైలును రాజహేంద్రవరంలో మూడు గంటల పాటు నిలిపేశారు. కాకినాడ సామర్లకోటలో ఆగిపోయిన షిరిడి నగర్ ప్రయాణికులను శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి తరలించారు. అనంతరం వారు షిరిడి సాయినగర్ రైలు ఎక్కారు. రైలు షెడ్యూల్ మార్పు విషయంలో తగిన ప్రచారం చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తెలిపారు.

బల్క్ డ్రగ్ పార్కు భయం

- రేపు ప్రధాని మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన
- నల్ల రిబ్బన్లతో నిరసనకు సిపిఎం పిలుపు
- భారీగా పోలీసులను మోహరించే పనిలో ప్రభుత్వం

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ప్రజలు వ్యతిరేకిస్తున్నా బల్క్ డ్రగ్ పార్కు (బిడిపి) పనులకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలోని 2001 ఎకరాల్లో పార్కు పనులకు ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖపట్నం నుంచి వర్చువల్‌లో శంకుస్థాపన చేయనున్నారు. ప్రజల అభ్యంతరాల మధ్య యంత్రాలతో కొద్దిరోజుల క్రితం పోలీసుల సమక్షంలో చెట్లు నరికించారు. హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గ పరిధిలో ఈ పార్కుకు శంకుస్థాపన జరగనుండడంతో పోలీసులను మోహరించి భూమిని చదును చేయించారు. రాజయ్యపేట వద్ద వర్చువల్ శంకుస్థాపనకు సమీప గ్రామాల జనాలను దగ్గరుండి తీసుకెళ్లే ఏర్పాట్లు చేశారు. మోడీ సభకు వాహనాల్లో తీసుకెళ్లే బాధ్యతను విఒఎలకు అప్పగించారు. మత్స్యకారులు, ప్రజల బతుకులను నాశనం చేసే బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. పరిశ్రమలొస్తే ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు లభిస్తాయని ఎరచూపి మోసగించే పనిలో ప్రభుత్వం ఉంది. హెటిరో డ్రగ్ కంపెనీ ఏర్పాటు చేసినప్పుడు ఈ ప్రాంత ప్రజలకు చెప్పిన మాటలే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు సందర్భంగానూ ప్రభుత్వం చెబుతోంది. హెటిరోలో నిర్వాసిత కుటుంబాలకు, స్థానిక యువతకు ఉద్యోగాలు లభించకపోవడంతో మోసపోయామని, మళ్లీ మోసగించి తమ బతుకులు పాడు చేయొద్దని మత్స్యకారులు, నిర్వాసిత ప్రజలు వాపోతున్నారు. హెటిరో కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నామని, 2001 ఎకరాల్లో రసాయన పరిశ్రమలొస్తే తామిక్కడ జీవించలేమని, ఊరొదిలి వెళ్లిపోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్.పురం, వేంపాడులోని 2001 ఎకరాల్లో రసాయన పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) మౌలిక సదుపాయాలు కల్పించనుంది. కాకినాడ జిల్లా తొండంగి మండలం కెపి.పురం-కోదాడ మధ్య ఏర్పాటు చేయబోయిన ఈ పార్కును ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకించడంతో వైసిపి ప్రభుత్వం నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి 2023 సెప్టెంబరు 20న ఆమోదించింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(RULE 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

వేది : 08-01-2025
స్థలం : విజయవాడ
అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పూడిమడక బ్రాంచ్ (06527)
పూడిమడక గ్రామం, అచ్యుతాపురం మండలం, అనకాపల్లి జిల్లా-531011.
ఇ-మెయిల్ : sbi.06527@sbi.co.in

ముందస్తు అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్స్ 8(5) & (6) నిబంధనల ప్రకారము జారీ చేయబడినది)

వేది : 06.01.2025
ప్రదేశం : పూడిమడక
అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

తేది : 08-01-2025

Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

తేది : 02-01-2025
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

FORM NO. 14
[See Regulation 33(2)]
OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhavanam, Saibaba Street, Daba Gardens, Visakhapatnam - 530 020

DEMAND NOTICE
NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.
RC/746/2017 09-12-2022
Central Bank of India, Guntur Main Branch, Guntur District
Versus
M/s Sri Venkata Sai Durga Agencies & Others
To
(CD 1) M/s Sri Venkata Sai Durga Agencies,Rep. by its sole Prop. Tummala Madhusudhana Rao,D.No. 4-20-44, 6th Lane, Siddharthanagar, Ring Road, Guntur District
(CD 2) Sri Tummala Madhusudhana Rao, S/o Achuta Rama Gandhi, D.No. 4-20-44, 6th Lane, Siddharthanagar, Ring Road, Guntur District
(CD 3) Sri Valluripalli Sudhakar, S/o Rasada Rau, Flat No.FF-1, Ambica Apartment, D.No.71-3-126, Koneruvari Street, Patamata, Vijayawada, Krishna District
(CD 4) Sri Patibandla Santhi Kiran, S/o Late Ramachandra Rao, H.No. 79 HIG, APHB Colony, Nallapadu Road, Guntur District
1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in OA /180/2014 an amount of Rs.1,26,26,850/-(Rupees OneCrore Twenty Six Lakhs Twenty Six Thousand Eight Hundred Fifty Only) along with pendentelite and future interest @ 14.50% per annum with monthly rests and interest is to be allowed accordingly on the above said amount from 15.04.2014 till realisation and the costs become due against you (Jointly and severally / fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institution Act 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 27/01/2023 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will be liable to pay:
(A) Such interests as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(B) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
[Given under my hand and the seal of the Tribunal , on this day 09-12-2022
(B.N.S.V.S.K BANGARRAJU)
RECOVERY OFFICER

Bank of India
బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఫోన్: 0863-2271006

అనుబంధం-IV [రూల్-8(1) చూడండి]
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

తేది: 02.01.2025, ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

విద్వేష క్రతువు

విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆదివారం నాడు విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో నిర్వహించిన హైందవ శంఖారావం సమాజంలో విద్వేషాలు నూరిపోసేందుకు ఉద్దేశించిన క్రతువులా అనిపిస్తోంది. సభా వేదిక మీద నుంచి చేసిన ప్రసంగాలు ఆ లక్ష్యంగానే సాగాయి. భవిష్యత్ కార్యాచరణను నిర్దేశిస్తూ ప్రకటించిన డిక్లరేషన్ ఆసాంతం సమాజంలో అలజడి రేపేదిగా ఉంది. హిందూ దేవాలయాల నిర్వహణను హిందూ సమాజానికే అప్పగించాలన్నది డిక్లరేషన్ ప్రధాన డిమాండ్. గుళ్లను ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి స్వయంప్రతిపత్తి కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. ఆక్రమణలకు గురైన దేవాలయ భూములను ప్రభుత్వం తిరిగి ఆయా దేవాలయాలకు అప్పగించకపోతే బలవంతంగా స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దేవాలయ సంస్థల్లో పని చేస్తున్న అన్య మతస్థులను తక్షణం తొలగించాలని అల్టిమేటం జారీ చేశారు. పండగలు, శోభాయాత్రల వంటి వాటిపై ఆంక్షలొద్దే వద్దని హూంకరించారు. తమ డిక్లరేషన్‌ను సాధించుకునేందుకు ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. ఆ విధంగా ప్రతిజ్ఞ సైతం చేయించారు. శంఖారావం డిక్లరేషన్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైనది. ప్రజా వ్యతిరేకమైనది. ఈ డిక్లరేషన్‌ను ప్రజాస్వామ్య వాదులంతా అభిశంసించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేవాలయాలపై పెత్తనం కోసమే విహెచ్‌పి ఒక పథకం ప్రకారం పని చేస్తోందని డిక్లరేషన్ బట్టి అర్థమవుతుంది. చరిత్రను పరిశీలిస్తే ఏ మతానికి చెందిన ప్రార్థనా మందిరాలైనా రాజులు, జమిందార్లు, ఆ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వాల పరిధిలోనే ఉన్నాయి. లౌకిక దేశంలో ప్రభుత్వాల పరిధిలోనే ఉండాలి కూడా. రాజ్యాంగం పౌరులందరికీ మత స్వేచ్ఛ ఇచ్చింది. దానికి పరిమితులూ విధించింది. దేవాలయ వైదిక క్రతువుల్లో ప్రభుత్వ జోక్యం ఉండరాదు. వాటి పరిధిలోని విద్యాలయాలు, వైద్యశాలలు ఇతర సంక్షేమ కార్యక్రమాలు పరిపాలన, నిర్వహణ, వంటి లౌకిక వ్యవహారాలను ప్రభుత్వం చూడాలి. ప్రభుత్వ నియంత్రణ వలన ఆలయాలు అపవిత్రం అవుతున్నాయి కనుక వాటి నుంచి విముక్తి కల్పించాలనడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే. దేవాలయాలకు వెనకటి రాజులు, పోషకులు, జమీందార్లు, భక్తులు విలువైన ఆస్తులను అందించారు. వాటన్నింటి కబ్జా కోసమే ఈ ఆలయాల స్వాధీనం డిమాండ్‌గా కనిపిస్తోంది. ఉత్తరప్రదేశ్ లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వమే యు.పి లో దేవాలయాలన్నింటినీ ప్రభుత్వ అధీనంలోకి తెస్తూ చట్టం తెచ్చింది. అయోధ్య రామాలయం ట్రస్టులో ప్రభుత్వ ప్రతినిధులున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ ట్రస్టుపై ఉంది. ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాశీలోని విశ్వేశ్వరస్వామి ఆలయం ట్రస్టు సైతం ప్రభుత్వ పరిధిలోనే నడుస్తోంది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆలయాలను ప్రభుత్వ చెర నుంచి విముక్తికి పోరాడతానంటోంది విహెచ్‌పి. ఈ రెండు నాల్కల వైఖరేంటి?

శంఖారావాన్ని విహెచ్‌పి నిర్వహించినా బిజెపి ప్రధాన శక్తి అన్నది బహిరంగ రహస్యం. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, పార్టీ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావడం ద్వారా అసలు విషయం అర్థమైపోతుంది. ఎపిలో బిజెపి ఉనికి కోసం ఎప్పటి నుంచో వెంపర్లాడుతోంది. కూటమి ప్రభుత్వంలో ఆ పని చేయాలని పథకం వేసింది. బిజెపి పెరగాలంటే దాని సహజ సిద్ధ ఎజెండా ప్రజల మధ్య విద్వేషాలు రాజేయడం. విహెచ్‌పి డిక్లరేషన్‌ను అందుకు ఉపయోగపెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. గుళ్లను రాజకీయ కేంద్రాలుగా, పండగలను మత ప్రచార కార్యక్రమాలుగా మార్చే ప్రయత్నం చేస్తోంది. గత వైసిపి ప్రభుత్వంలో రామతీర్థం, అంతర్వేది, తిరుపతి వంటి వాటిని ముందుకు తెచ్చింది. కొంత కాలం లడ్డూ వివాదం, సనాతన ధర్మం అంది. ఇప్పుడు ఏకంగా దేవాలయాల స్వాధీనం అంటోంది. దేవాలయ భూముల్లో దశాబ్దాల నుంచి ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదలు గెంటివేతకు గురవుతారు. మతం ప్రాతిపదికగా దేవాలయ సంస్థల్లో పని చేసేవారు, వ్యాపారాలు చేసే వారిపై నిషేధం రాజ్యాంగ విరుద్ధం. సామాజిక న్యాయానికి విఘాతం కలిగిస్తాయి. ఇటువంటి కుట్రలను ప్రజలు అప్రమత్తతతో ఎదుర్కోవాలి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో మతోన్మాద కుయుక్తులు సాగవని చాటాలి.

మహనీయుల మాట



స్త్రీ పురుషుడిపై ఆధార పడాల్సి వస్తోంది.
తల్లిదండ్రులు పిల్లలపై ఆధార పడాల్సి వస్తోంది.
ఈ పరాధీనతకు మూలం సొంత ఆస్తే.
కమ్యూనిస్టు సమాజం సొంత ఆస్తిని రద్దు చేస్తుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్,
కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక.

ప్రత్యామ్నాయం

డాలర్ ఎందుకు బలపడుతోంది?

ప్రభాత్ పట్నాయక్

డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ పడిపోతోందన్న కథనాలు ఇటీవల వార్తాపత్రికల్లో ఎక్కువగా వస్తున్నాయి. ఒక నెల రోజుల క్రితం, నవంబర్ 27 నాటికి డాలర్ విలువ రూ.84.559గా ఉండేది. డిసెంబర్ 29 కల్లా అది రూ.85.5కి పెరిగింది. రూపాయి మారకపు విలువ పడిపోకుండా అరికట్టడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తన విదేశీ మారకపు నిల్వల నుండి డాలర్లను అదనంగా మార్కెట్లోకి విడుదల చేసింది. నవంబర్ 22 నాటికి 657.89 డాలర్ల విదేశీ మారకపు నిల్వలు ఉంటే అది డిసెంబర్ 20 నాటికి 644.39 డాలర్ల కి తగ్గింది. అయినా, రూపాయి విలువ తగ్గిపోవడం ఆగలేదు. రిజర్వు బ్యాంకు గనుక తన డాలరు నిల్వలను అదనంగా మార్కెట్లోకి విడుదల చేయకపోయి వుంటే రూపాయి విలువ ఇంకా తగ్గిపోయి వుండేది.

మన దేశ ఆర్థిక వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ కొనసాగిన కాలంలో రూపాయి-డాలర్ మారకపు విలువ స్థిరంగా ఉండేది. ప్రభుత్వం రూపాయి విలువను తగ్గించినప్పుడు మాత్రమే ఆ మారకపు రేటులో మార్పు జరిగేది. ఆ విధంగా స్థిరంగా మారకపు రేటును కొనసాగించగలడానికి కారణం ప్రభుత్వ నియంత్రణలో విదేశీ మారకపు నిల్వలు ఉండేవి. ఆ విధమైన నియంత్రణ లేకుండా పోయిన తర్వాత (నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలైన తర్వాత) రూపాయి విలువ దిగజారిపోవడం అనేది మొదలై కొనసాగుతూనే వుంది. 1991లో డాలర్ విలువ రూ.22.74గా ఉండేది. 2014లో మోడీ అధికారం చేపట్టే నాటికి అది రూ.62.33 అయింది. ఇప్పుడు అది రూ.85.5 దాటిపోయింది.

అమెరికాలో కన్నా భారతదేశంలో ద్రవ్యోల్బణం రేటు ఎక్కువగా ఉన్నందువలన జరుగుతున్న పరిణామం కాదిది. అక్కడికన్నా ఇక్కడ ద్రవ్యోల్బణం కొంత ఎక్కువ ఉన్నమాట వాస్తవమే కాని, రూపాయి విలువ పతనానికి అది ప్రాథమిక కారణం కాదు. నిజానికి రూపాయి మారకపు రేటు పడిపోవడం వలన మన దేశంలో ద్రవ్యోల్బణం రేటు అమెరికాలో కన్నా ఎక్కువగా ఉంది. ముడిచమురు తదితర దిగుమతుల ధరలు రూపాయి విలువ పడిపోతున్న కారణంగా పెరిగిపోతున్నాయి. దాని ఫలితంగా అనేక సరుకుల ధరలు పెరుగుతున్నాయి. అది అధిక ద్రవ్యోల్బణానికి దారి తీస్తోంది. రూపాయి విలువ పడిపోవడానికి ప్రాథమిక కారణం ఏదైనప్పటికీ, దాని ఫలితంగా ద్రవ్యోల్బణం పెరగడం గనుక మొదలైతే, అది తిరిగి రూపాయి విలువను మరింత తగ్గించడానికి దారి తీస్తుంది. స్పెక్యులేటర్లు రూపాయి విలువ పడిపోతుందన్న అంచనాతో డాలర్లను ఎక్కువగా కొనుగోలు చేస్తారు గనుక అది రూపాయి విలువను దెబ్బ తీస్తుంది. ఇలా రూపాయి మారకపు విలువ పడిపోవడం, ద్రవ్యోల్బణం పెరిగిపోవడం అనే విష వలయం నడుస్తూ వుంటుంది.

> **"అమెరికన్ డాలర్‌తో పోల్చినప్పుడు ఆ యా దేశాల కరెన్సీల విలువలు తగ్గిపోయినందువలన అవి దిగుమతి చేసుకునే ముడి చమురు వంటి సరుకుల ధరలు ఆ యా దేశాల కరెన్సీలలో పెరిగిపోతాయి. అది ఆ దేశాలలో ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. దానిని తట్టుకోడానికి ఆ యా ప్రభుత్వాలు తమ దేశాల్లో పొదుపు చర్యలు తీసుకునే పేరుతో సంక్షేమానికి కోతలు పెడతాయి. అది కార్మికుల కొనుగోలు శక్తిని దెబ్బ తీయడంతోబాటు నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. నిరుద్యోగం పెరుగుతున్నకొద్దీ కార్మికుల బేరసారాల శక్తి సన్నగిల్లిపోతూ వుంటుంది. ఆ విధంగా కార్మికులు అంతకంతకూ మరింత పేదరికంలోకి నెట్టుబడతారు."**

ఈ విధంగా డాలర్‌తో పోల్చితే తమ దేశ కరెన్సీ విలువ పడిపోవడం అనే ధోరణి కేవలం మన రూపాయికే పరిమితం అయి లేదు. మూడవ ప్రపంచ దేశాలన్నింటిలోనూ కనిపించే ధోరణి ఇది. అందుకే రూపాయి మారకపు రేటు పడిపోకుండా ఒక స్థిరమైన స్థాయి దగ్గర నిలబెట్టేలా ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, అందుకోసం విదేశీ మారకపు నిల్వల మీద, పెట్టుబడుల రాకపోకల మీద ప్రభుత్వ నియంత్రణ ఉంటేనే ఇది సాధ్యపడుతుందని చెప్తున్నాం. ఈ విధంగా చేయడం ప్రభుత్వ నియంత్రణ ఉన్న కాలంలో, అంటే...నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టక పూర్వం సాధ్యపడింది.

రూపాయి మారకపు రేటు పడిపోవడం అనేది ఒక్కోసారి వేగంగాను, ఒక్కోసారి కాస్త నెమ్మదిగాను జరుగుతూ వుంటుంది. ఇలా గత కొద్ది వారాలలో రూపాయి విలువ హఠాత్తుగా పడిపోవడం అనేది ఎందుకు జరుగుతోంది? మన దేశపు ద్రవ్యోల్బణ రేటు అమెరికాలో కన్నా ఎక్కువగా ఉండడమే కారణమని, మన విదేశీ లోటు (ఎగుమతుల విలువ కన్నా దిగుమతుల విలువ పెరిగిపోవడం) పెరిగిపోవడమే కారణమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాని ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల కరెన్సీలతో పోల్చితే డాలర్ విలువ ఎందుకు బలపడుతోంది అన్న అంశం మీద ఎవరూ దృష్టి పెట్టడం లేదు. నిజానికి ఇప్పుడు డాలర్ విలువ ఉన్నంత బలంగా గత దశాబ్ద కాలంలో ఎప్పుడూ లేదు. డాలర్ బలాన్ని సూచించే బ్లూంబెర్గ్ డాలర్ స్పాట్ ఇండెక్స్ ఈ ఏడాది ఏకంగా 7 శాతం పెరిగింది. 2015 తర్వాత డాలర్ విలువ అత్యధికంగా పెరిగింది ఈ సంవత్సరంలోనే.

మామూలుగా చూస్తే ఇలా డాలర్ బలపడడం అనేది అంతుపట్టని వ్యవహారంలా కనిపిస్తుంది. ఎందుకంటే ట్రంప్ తాను అధికారం చేపట్టగానే దిగుమతుల మీద ఏ విధంగా సుంకాలను పెంచబోతున్నాడో ఇప్పటికే ప్రకటించాడు. ఇంకోపక్క ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటివో వంటి వివిధ అంతర్జాతీయ సంస్థలు స్వేచ్ఛా వ్యాపారం గొప్పదనాన్ని శ్లాఘిస్తూ సుంకాలను పెంచడం వంటి చర్యలు ఏ విధంగా తిరోగమన స్వభావాన్ని సూచిస్తాయో చెప్తూ తమ ప్రవచనాలను కొనసాగిస్తున్నాయి. స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థలో అన్నింటినీ మార్కెట్టే నిర్ణయిస్తుంది అన్నప్పుడు, దానిని నియంత్రించే చర్యలను ట్రంప్ చేపట్టబోతున్నప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థ పట్ల రానున్న కాలంలో మార్కెట్ ప్రతికూలంగా స్పందించే అవకాశం ఎక్కువగా ఉండాలి కదా? అప్పుడు ఆ దేశం నుండి పెట్టుబడులు బైటకు తరలిపోయే అవకాశాలు ఎక్కువగా పెరగాలి. అప్పుడు డాలర్ విలువ తగ్గాలి. కాని దానికి పూర్తి విరుద్ధంగా డాలర్ విలువ పెరగడాన్ని మనం చూస్తున్నాం. అంతే కాక డాలర్ విలువ పెరగడానికి ఒక కారణం దిగుమతుల మీద అధిక సుంకాలను విధించే విధానాన్ని ప్రకటించడమే అని కూడా విశ్లేషణలు వస్తున్నాయి. ఈ వ్యవహారం చూస్తే అంతుబట్టనట్టు కనిపిస్తోంది. దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

స్వేచ్ఛా మార్కెట్ విశిష్టత గురించి నిత్యం వినపడే ప్రవచనాలన్నీ కేవలం మూడో ప్రపంచ దేశాల రాజకీయ నాయకుల తలల్లోకి ఎక్కించడానికేనని, అమాయక చక్రవర్తులను బుట్టలో వేయడానికేనని, నిజానికి మార్కెట్ శక్తులు ఈ ప్రవచనాలను పెద్దగా పట్టించుకోవు అని గ్రహిస్తే అసలు విషయం మనకు బోధపడుతుంది. అమెరికా తన దేశంలోకి వచ్చే దిగుమతుల మీద అధిక సుంకాలను విధిస్తే ఆ విధంగా దిగుమతయ్యే విదేశీ సరుకుల రేట్లు పెరుగుతాయి. అప్పుడు దేశీయంగా ఉత్పత్తి అయ్యే సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. అది అదనపు ఉపాధి కల్పనకు దారి తీస్తుంది. దేశీయంగానే ఉత్పత్తి చేయగల సరుకులను విదేశాల నుండి దిగుమతి కాకుండా అధిక సుంకాల ద్వారా నిరోధించడం వలన అమెరికాలో ఉపాధి పెరుగుతుంది. ఇందువలన ఇతర దేశాలు నష్టపోతాయి. పైగా అమెరికా విదేశీ వ్యాపార లోటు కూడా తగ్గుతుంది. ఆ విధంగా అమెరికా తన దేశంలో ఉపాధి అవకాశాలను, ఉత్పత్తిని, వ్యాపార లోటు పరిస్థితిని- అన్నింటినీ పెంచుకోగలుగుతుంది. అంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. ఈ అంచనా మదుపరుల్లో డాలరు మీద విశ్వాసాన్ని మరింత పెంచుతుంది. దాంతో డాలర్ విలువ మరింత పెరుగుతుంది. దాంతో పోల్చినప్పుడు ఇతర దేశాల కరెన్సీల విలువలు తగ్గిపోతాయి. రక్షణాత్మక చర్యలు తీసుకుంటే ఆ దేశం మదుపరుల విశ్వాసాన్ని కోల్పోతుందని, పెట్టుబడులు వేరే దేశాలకు తరలిపోతాయని, దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినిపోతుందని స్వేచ్ఛావ్యాపార సిద్ధాంతవేత్తలు చెప్పేదానికి వ్యతిరేకంగా ఇది ఉంది.

అమెరికా రక్షణాత్మక చర్యలు తీసుకోవడం వలన ఆ దేశంలో ద్రవ్యోల్బణం కొంతవరకూ పెరుగుతుందన్నది వాస్తవం. కాని అమెరికాకు సరుకులను ఎగుమతి చేసే ఇతర దేశాలలో కూడా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ముడిచమురు వంటి కొన్ని కీలకమైన ముడిపదార్థాల ధరలు డాలర్ల లెక్కల్లోనే అంతర్జాతీయంగా నిర్ణయిస్తారు. అమెరికా తీసుకున్న చర్యల వలన డాలర్ విలువ పెరిగాక ముడిచమురు ధర కూడా ఇతర కరెన్సీలలో పెరుగుతుంది. అందుచేత ఆ యా దేశాల దిగుమతుల ఖరీదు మరింత పెరుగుతుంది. అది ఆ దేశాలలో ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది.

> **"ఈ విధంగా డాలర్‌తో పోల్చితే తమ దేశ కరెన్సీ విలువ పడిపోవడం అనే ధోరణి కేవలం మన రూపాయికే పరిమితం అయి లేదు. మూడవ ప్రపంచ దేశాలన్నింటిలోనూ కనిపించే ధోరణి ఇది. అందుకే రూపాయి మారకపు రేటు పడిపోకుండా ఒక స్థిరమైన స్థాయి దగ్గర నిలబెట్టేలా ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, అందుకోసం విదేశీ మారకపు నిల్వల మీద, పెట్టుబడుల రాకపోకల మీద ప్రభుత్వ నియంత్రణ ఉంటేనే ఇది సాధ్యపడుతుందని చెప్తున్నాం. ఈ విధంగా చేయడం ప్రభుత్వ నియంత్రణ ఉన్న కాలంలో, అంటే...నయా ఉదారవాద విధానాలను ప్రవేశ పెట్టక పూర్వం సాధ్యపడింది."**

ఆ దేశాలలోని కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బ తింటాయి. మొదటి కారణం: అమెరికాకు పంపే ఎగుమతులు తగ్గిపోవడం వలన ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. రెండో కారణం: అమెరికన్ డాలర్‌తో పోల్చినప్పుడు ఆ యా దేశాల కరెన్సీల విలువలు తగ్గిపోయినందువలన అవి దిగుమతి చేసుకునే ముడి చమురు వంటి సరుకుల ధరలు ఆ యా దేశాల కరెన్సీలలో పెరిగిపోతాయి. అది ఆ దేశాలలో ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. దానిని తట్టుకోడానికి ఆ యా ప్రభుత్వాలు తమ దేశాల్లో పొదుపు చర్యలు తీసుకునే పేరుతో సంక్షేమానికి కోతలు పెడతాయి. అది కార్మికుల కొనుగోలు శక్తిని దెబ్బ తీయడంతోబాటు నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. నిరుద్యోగం పెరుగుతున్నకొద్దీ కార్మికుల బేరసారాల శక్తి సన్నగిల్లిపోతూ వుంటుంది. ఆ విధంగా కార్మికులు అంతకంతకూ మరింత పేదరికంలోకి నెట్టుబడతారు.

విదేశీ రుణ భారం మరీ ఎక్కువగా ఉన్న దేశాలలో కార్మికులు మరింత ఎక్కువగా దెబ్బ తింటారు. డాలర్‌తో పోల్చినప్పుడు ఆ దేశాల కరెన్సీల విలువలు తగ్గిపోతాయి కనుక, రుణ వాయిదాలను డాలర్ల రూపంలోనే చెల్లించాలి కనుక, ఆ వాయిదాల భారం మరింత పెరిగిపోతుంది. ఆ భారం అంతిమంగా కార్మికులపైనే పడుతుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక విధానం ఎంత హేతువిరుద్ధమైనదో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అంతకంతకూ స్పష్టంగా కనిపిస్తోంది. కోట్లాదిమంది ప్రజల జీవితాలు కొద్దిమంది స్పెక్యులేటర్ల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి, వారి మితిమీరిన దురాశకు బలౌతున్నాయి. ట్రంప్ తీసుకోబోయే రక్షణాత్మక చర్యల ప్రభావం ఈ పరిస్థితికి దోహదం చేస్తున్నప్పటికీ, ప్రధానమైనది ఈ స్పెక్యులేటర్ల దురాశే. పెట్టుబడిదారీ విధానంలో ఈ దురాశే కీలకంగా ఉంటుంది.

(స్వేచ్ఛానుసరణ)

సమస్య

చిత్తశుద్ధి లేని క్షమాపణలు

సత్య

> **మణిపూర్ అంశం ప్రస్తావనకు వచ్చినప్పడల్లా బిజెపి నేతలు గతంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి, విదేశీ జోక్యం గురించి చెబుతూ తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు చూస్తారు. సరిహద్దుల భద్రత, అక్రమ చొరబాట్లను అరికట్టాల్సింది కేంద్ర ప్రభుత్వం. పదేళ్ల నుంచి ఏం చేస్తున్నట్లు? 2017 నుంచి ఇదే బీరేన్ సింగ్ సిఎంగా ఉన్నారు. ఈ పెద్దమనిషి ఏం చేస్తున్నట్లు? అంతా చేసి నేరం నుంచి తప్పించుకోవటం తప్ప క్షమాపణలో చిత్తశుద్ధి లేదని మణిపూర్ గిరిజన సంఘాల ఐక్యతా కమిటీ బీరేన్ సింగ్ ప్రకటన మీద వ్యాఖ్యానించింది.**

మణిపూర్‌లో 2023 మే మూడవ తేదీన రెండు సామాజిక తరగతుల మధ్య పరస్పర అనుమానాలతో ప్రారంభమైన ఘర్షణ 2024లో కొనసాగి మూడో ఏడాదిలో ప్రవేశించింది. ఎప్పుడు ముగుస్తుందో తెలియటం లేదు. పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమైనందుకు విచారంగా ఉందంటూ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. అయితే ఒక్క రోజు కూడా గడవక ముందే విమర్శకులపై ఎదురు దాడికి దిగటాన్ని బట్టి విచార ప్రకటనలో చిత్తశుద్ధి లేదని స్వయంగా వెల్లడించుకున్నారు. మెయితీ-కుకీ, జో తెగల మధ్య ప్రారంభమైన ఘర్షణల్లో కొందరు మహిళలపై అత్యాచారాలు, నగ్నంగా ఊరేగింపులు జరిగాయి. 260 మంది ప్రాణాలు కోల్పోయారు. అరవై వేల మంది నెలవులు తప్పారు. బాధితుల్లో ఎక్కువ మంది గిరిజనులైన కుకీలే ఉన్నారు. మెయితీలందరినీ గిరిజనులుగా పరిగణించాలంటూ హైకోర్టు పెట్టిన చిచ్చు అక్కడ జరుగుతున్న దారుణ మారణకాండకు మూలం. రెండింజన్ల పాలన సాగిస్తున్న బిజెపి ఆదిలోనే దానికి తెర దించి ఉంటే ఇంత జరిగేది కాదు.

మణిపూర్‌లో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైంది. అదే ఏ ప్రతిపక్ష పార్టీనో అధికారంలో ఉంటే అలా ఉపేక్షించేదా? అల్లకల్లోల పరిస్థితి ఏర్పడిన కారణంగా రాష్ట్రం మొత్తాన్ని మిలిటరీకి అప్పగించారు. అక్కడ బిజెపికి చెందిన ముఖ్యమంత్రి, మంత్రులు రాజభోగాలు అనుభవించటం తప్ప చేసేదేమీ లేదు. ప్రపంచమంతటా, మణిపూర్ చుట్టూ ప్రధాని నరేంద్రమోడీ విమానాల్లో తిరుగుతారు, సుభాషితాలు చెప్పి వస్తున్నారు తప్ప మణిపూర్ వెళ్లి భరోసా ఇచ్చేందుకు ఎలాంటి చొరవ లేదు.

ప్రతిపక్షాలు ముందుకు తెచ్చిన అనేక అంశాల మీద మోడీ మౌనంగా ఉన్నట్లుగానే ఆయన ప్రథమ గణంలోని బీరేన్ సింగ్ మౌనంగా ఉంటే అదొక తీరు. కానీ ఎదురుదాడికి దిగారు. గతంలో కూడా మణిపూర్‌లో అనేక ఉదంతాలు జరిగాయి కదా వాటన్నింటికీ నాడు ప్రధానులుగా ఉన్న పివి నరసింహారావు, ఐకె గుజ్రాల్ క్షమాపణలు చెప్పారా అని ప్రశ్నించారు. ఆ నాడు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్నవారు కూడా క్షమాపణలు చెప్పిన దాఖలా లేదు, మరి బీరేన్ సింగ్ ఎందుకు చెప్పినట్లు? నాడు మణిపూర్‌లో జరిగిన ఉదంతాలను పాలకులు మూసిపెట్టలేదు, మోడీ ఏలుబడిలో ఎందుకు పాచిపోయేట్లు చేసినట్లు?

మణిపూర్ అంశం ప్రస్తావనకు వచ్చినపుడల్లా బిజెపి నేతలు గతంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి, విదేశీ జోక్యం గురించి చెబుతూ తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు చూస్తారు. సరిహద్దుల భద్రత, అక్రమ చొరబాట్లను అరికట్టాల్సింది కేంద్ర ప్రభుత్వం. పదేళ్ల నుంచి ఏం చేస్తున్నట్లు? 2017 నుంచి ఇదే బీరేన్ సింగ్ సిఎంగా ఉన్నారు. ఈ పెద్దమనిషి ఏం చేస్తున్నట్లు? అంతా చేసి నేరం నుంచి తప్పించుకోవటం తప్ప క్షమాపణలో చిత్తశుద్ధి లేదని మణిపూర్ గిరిజన సంఘాల ఐక్యతా కమిటీ బీరేన్ సింగ్ ప్రకటన మీద వ్యాఖ్యానించింది. ఒక మైనారిటీ తరగతి మీద జరిపిన మారణకాండ బాధ్యత నుంచి తప్పించుకొనేందుకు సిఎం చూశారని పేర్కొన్నది. కుకీ-జో గిరిజనుల పట్ల వివక్ష నిలిపివేయాలని మరో గిరిజన సంఘాల కమిటీ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో సాయుధ బృందాలపై భద్రతా దళాలు జరిపిన దాడులలో స్టార్ లింక్ ఉపగ్రహ యాంటెన్నా, రౌటర్‌తో పాటు ఆధునిక రైఫిళ్లు దొరికినట్లు ప్రకటించారు. మారుమూల ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను అందించే ఈ ఉపగ్రహం సేవలను పొందటం మన దేశంలో నిషిద్ధం, అయినప్పటికీ అవి దొరికాయంటే అనధికారికంగా సమాచారం అందుకున్నట్లు స్పష్టమౌతోంది. వీటిని మెయితీలు అధికంగా నివసించే ప్రాంతాలపై జరిగిన దాడుల సమయంలో సాయుధులు వదలివేసి పారిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే తమ ఉపగ్రహం నుంచి భారత్‌కు సంకేతాలు అందకుండా చేసినట్లు ఎలన్ మస్క్ చెప్పుకున్నాడు. తమ దాడుల సందర్భంగా మయన్మార్‌లో తయారైన ఆయుధాలు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కూడా పోలీసు అధికారులు చెప్పారు. వాటిలో మయన్మార్ సైనికులు వాడే ఎంఎ4 రైఫిల్, ఎకె47 కూడా ఉంది. గత ఐదారు నెలల నుంచి సాయుధ బృందాలు తల దాచుకున్న ప్రాంతాలలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, మిలిటరీ యూనిఫారాలు తదితరాలను కూడా పట్టుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మయన్మార్ సరిహద్దులను దాటి ఉగ్రవాదులు రాకపోకలు సాగిస్తున్నా, ఆయుధాలు అక్రమ రవాణా జరుగుతుంటే సరిహద్దు భద్రతలను చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తున్నట్లు? స్టార్ లింక్ ఉపగ్రహం నుంచి ఉగ్రవాదులు, సాయుధ మూకలకు సంకేతాలు, సందేశాలు అందుతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత కూడా కేంద్రానిదే. భద్రమైన చేతుల్లో దేశం ఉందని నరేంద్ర మోడీ గురించి గొప్పలు చెప్పుకోవటం తప్ప ఉపయోగం ఏముంది?

తాజా ఘర్షణలు, దాడులకు 2023 ఏప్రిల్ 14న మణిపూర్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలే మూలం! మెయితీ సామాజిక తరగతికి గిరిజన హోదా కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేయాలంటూ తనకు లేని అధికారంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తరువాత సుప్రీం కోర్టు ఈ చర్యను తప్పు పట్టింది. ఒక పెద్ద కుట్రలో భాగంగా అక్కడ పరిణామాలు జరిగినట్లు భావిస్తున్నారు. హైకోర్టు ఆదేశాన్ని నిరసిస్తూ మే 3వ తేదీన గిరిజన విద్యార్థులు నిరసన తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఏదో ఒక వైపు నుంచి హింసాకాండ జరుగుతూనే ఉంది. మెయితీ-గిరిజనుల మధ్య పరస్పరం అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. మయన్మార్‌లో 2021 మిలిటరీ తిరుగుబాటు సమయంలో అక్కడి నుంచి శరణార్థులుగా వచ్చిన వారి గురించి మెయితీలు అభ్యంతరం తెలిపారు. ఇవన్నీ కూడా బిజెపి రెండింజన్ల పాలనలోనే జరిగాయి. అందువలన గత కాంగ్రెస్ పాలనే కారణం అనటం తప్పించుకోచూడటం తప్ప మరొకటి కాదు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అక్కడ నాగా పీపుల్స్ ఫ్రంట్ అనే ఒక ప్రాంతీయ పార్టీతో జత కట్టి చెరో సీటులో పోటీ చేసింది. రెండు సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను గమనంలో ఉంచుకొని క్షమాపణల పర్వానికి తెర తీశారని చెప్పాల్సి వస్తోంది. మెయితీలను గిరిజనులుగా గుర్తించాలా లేదా అన్నది బిజెపి తేల్చటం లేదు. తమకు అన్యాయం చేస్తారని కుకీ, ఇతర గిరిజనులు అనుమానంగా చూస్తుంటే తమకు రిజర్వేషన్ల ఆశ చూపి ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని చూసి ఎటూ తేల్చటం లేదని మెయితీలు అసంతృప్తితో ఉండటమే బిజెపి ఓటమికి కారణం.

కవిత్వం

ఒక అద్భుతం!

పుస్తకం ఎంత అద్భుతమైందీ?
చెట్టుతో తయారైన ఒక బల్ల పరుపు వస్తువు
సులభంగా అటూ ఇటూ కదలగలిగే విచిత్రం
తెల్లటి ఒంటి మీద కొన్ని గజిబిజి ఆకారాలు
అద్దుకుని... నీ కోసం ఎదురు చూసే వస్తువు
ఒకే ఒక్క చూపు చూస్తే చాలు-
నువ్వు మరొకరి మెదడులోకి
నేరుగా ప్రవేశించగలవు -
ఆ మరొకరు బహుశా....
వేల ఏళ్ళ క్రితమే కన్ను మూసినవారు కావొచ్చు.
వేల ఏళ్ళ తర్వాత కూడా, కొందరు రచయితలు
నిశ్శబ్దంగా, స్పష్టంగా నీ తలలో
మాట్లాడుతున్నారూ అంటే,
రాయడం అనేది మానవుడి
ఆవిష్కరణలలో ఎంత గొప్పదీ?
ఎంత సున్నితమైందీ? ఎంత సుందరమైందీ?
నీ పరిచితులని, అపరిచితులని
వేల వేల యుగాల్లో
వేరు వేరు దేశాల్లో
ఉన్న వాళ్ళందరినీ ఒక్కటిగా కలిపేది!
కాలం అడ్డు గోడల్ని ధ్వంసం చేసేది!!
మానవ మేధకు ఒక ఉదాహరణ - పుస్తకం!
మనిషి మహాద్భుతాలు సాధించాడనడానికి,
ఒక రుజువు!!

- డా॥ దేవరాజు మహారాజు

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

11 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 1258 పాయింట్ల పతనం
- ఎఫ్ఐఐల అమ్మకాలు

న్యూఢిల్లీ : దలాల్ స్ట్రీట్‌లో హెచ్ఎంపివి వైరస్ కల్లోలం రేపింది. ఈ వైరస్ భారత్‌లోనూ బయటపడిందన్న తొలిరోజు వార్తలతో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఒక్క పూటలోనే రూ.11 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఈ కొత్త వైరస్ భయాలతో సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1258 పాయింట్లు లేదా 1.59 శాతం పతనమై 77,964.99 కనిష్టానికి పడిపోయింది. ఇంట్రాడేలో 79,532-77,781 మధ్య కదలాడింది. ఉదయం యథాతథంగా ప్రారంభమైన సూచీలు.. కాసేపు స్వల్ప లాభ నష్టాల మధ్య కదలాడగా.. ఆ తర్వాత బెంగళూరులో ఇద్దరు చిన్నారుల్లో హెచ్ఎంపివి వైరస్ బయటపడిందనే వార్తలు గుప్పుమన్నాయి. ఇక ఆ తర్వాత మార్కెట్ల పతనం తుది వరకు కొనసాగింది. మరోవైపు ఆసియా మార్కెట్లలో బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు సూచీలను మరింత ఒత్తిడికి గురి చేశాయి. సెన్సెక్స్ బాటలోనే ఎన్ఎస్ఇ నిఫ్టీ50 సూచీ కూడా 388.70 పాయింట్లు లేదా 1.62 శాతం కోల్పోయి 23,616కు పడిపోయింది. నిఫ్టీ 50లో 43 స్టాక్స్ నేల చూపులు చూశాయి. మదుపర్ల సంపదగా భావించే బిఎస్ఇలో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.11 లక్షల కోట్ల మేర పతనమై రూ.438.79 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.

సెన్సెక్స్-30లో టైటన్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, సన్ ఫార్మా షేర్లు మాత్రమే 0.60 శాతం వరకు పెరగ్గా.. మిగితా 27 స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. టాటా స్టీల్, ఎన్‌టిపిసి, కొటాక్ బ్యాంక్, పవర్ గ్రిడ్, జొమాటో, ఆదానీ పోర్ట్స్, ఇండుస్ఇండ్ బ్యాంక్, ఆసియన్ పెయింట్స్, ఐటిసి షేర్లు అత్యధికంగా 4.41 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. 176 స్టాక్స్ ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయాయి. మరోవైపు వైద్య, ఫార్మా కంపెనీల సూచీలు 2 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీలో స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 2.70 శాతం, 3.20 శాతం చొప్పున నష్టపోయాయి.

నిఫ్టీలో అన్ని రంగాలు పతనమయ్యాయి. పిఎస్‌యు బ్యాంకింగ్ 4 శాతం విలువ కోల్పోయింది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్, కాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఆటో రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. చైనాలో హెచ్ఎంపివి వైరస్ భారత్‌లోనూ బయట పడటంతో ఇన్వెస్టర్లు ఆందోళనకు గురైయ్యారని

బ్రోకర్లు పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఆసియా మార్కెట్ల ప్రతికూలతను ఎదుర్కొన్నాయన్నారు. దీనికి తోడు గత కొన్ని రోజులుగా విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) దేశీయ స్టాక్ మార్కెట్‌లో తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఎన్ఎస్ఇలో ఒక్క రోజే రూ.4,227 కోట్ల ఎఫ్ఐఐలు విక్రయించినట్లు సమాచారం. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ ఆల్‌టైం కనిష్టానికి పడిపోవడం తదితర పరిణామాలు మార్కెట్లను కుదేలు చేశాయి. ఈ ప్రభావం వచ్చే సెషన్లలోనూ ఉండొచ్చని.. రిటైల్ ఇన్వెస్టర్లు చాలా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

పాతాళానికి రూపాయి



ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ వెలవెల పోతోంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత క్షీణించి నూతన రికార్డ్ కనిష్టానికి పడిపోయింది. సోమవారం డాలర్‌తో రూపాయి విలువ మరో నాలుగు పైసలు పతనమై డాలర్‌తో 85.83 కనిష్ట స్థాయికి దిగజారింది. భారత కరెన్సీ చరిత్రలోనే ఇది మరో రికార్డ్ కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 85.77 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 85.84 కనిష్ట స్థాయిని తాకింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఇతర దేశీయ బలహీన ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 0.31 శాతం తగ్గి 76.27 డాలర్ల వద్ద ట్రేడింగ్ అయ్యింది. ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడానికి తోడు భారత విదేశీ మారకం నిల్వలు డిసెంబర్ 27తో ముగిసిన వారంలో 4.122 బిలియన్ డాలర్లు తరిగి 640.279 బిలియన్ డాలర్లకు పడిపోవడం భారత కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపింది.

డిబిఎస్ బ్యాంక్ ఇండియా సిఇఒగా రజత్ వర్మ

సింగపూర్ : డిబిఎస్ బ్యాంక్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సిఇఒ) రజత్ వర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సిఇఒ సురోజిత్ షోమ్ 2025 ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేసిన అనంతరం రజత్ బాధ్యతలు స్వీకరిస్తారని డిబిఎస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త హోదాలో, డిబిఎస్ గ్రూప్ మేనేజ్‌మెంట్ కమిటీలో రజత్ భాగంగా ఉంటారని పేర్కొంది. రజత్ వర్మ ప్రస్తుతం డిబిఎస్ బ్యాంక్ ఇండియాలో ఇనిస్టిట్యూషనల్ బ్యాంకింగ్ గ్రూప్ (ఐజిబి) హెడ్‌గా ఉన్నారు.

భారత రియాల్టీ మందగింపు

ఇక్రా రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ : భారత రియాల్టీ రంగంలో మందగింపు చోటు చేసుకోనుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత నిర్మాణ కంపెనీల రెవెన్యూ వృద్ధి 8-10 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఏడాది ఈ రంగం 12-15 శాతం వృద్ధిని సాధించింది. 2024-25 లో నిర్మాణ కంపెనీల నిర్వహణ ఆదాయాలు 10-12 శాతంగా ఉండొచ్చని.. ఇది ఇంతక్రితం 2017-18 నుంచి 2023-24 మధ్య సగటున చోటు చేసుకున్న 15 శాతం వృద్ధితో పోల్చితే చాలా తక్కువని ఇక్రా పేర్కొంది.

సవరణ

ICICI Bank — శాఖా కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్‌హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

పశ్చిమ గోదావరి, పాలకొల్లు మరియు విజయవాడ ఎడిషన్ ప్రజాశక్తి (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీషు) లో ప్రచురించబడిన భౌతిక స్వాధీనతా నోటీసు ప్రకటనకు ఇది సూచన. రుణగ్రహీతల పేరు మరియు ఎల్ఎఎన్ నం.395305000974 మరియు 395355000004- శ్రీ కోదండరామ ఆక్వా ఫీడ్స్ మరియు నీడ్స్ 22 నవంబరు, 2024న ఎడిషన్‌లో ప్రచురించబడిన భౌతిక స్వాధీనంలో అనుకోకుండా జరిగిన పొరపాటు కారణంగా తేది 18.11.2024 కి బదులుగా 18.10.2024 గా వచ్చినది, దయచేసి దీనిని 18.11.2024 గా చదువగలరు పైన పేర్కొన్న నోటీసులోని మిగతా అంశములు మారవు.

తేది : 07 జనవరి, 2025 — అధీకృత అధికారి
ప్రదేశం : పశ్చిమ గోదావరి, పాలకొల్లు మరియు విజయవాడ — ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

IDFC FIRST Bank

(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్టన్ రోడ్, చెట్‌పెట్, చెన్నై-600031.
TEL: +91 44 4564 4000 I FAX: +91 44 4564 4022.

అనుబంధం 4 (రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది) యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది: 30.09.2023నాటి డిమాండ్ నోటీసు జారీచేసి రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు: 1) రాజా పెయింట్స్, 2) మురికిపూడి సుశీల, 3) జయరాజు మురికిపూడి వారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు 27.09.2023 నాటికి రూ.66,78,388.93/- ...

స్థిరాస్తుల యొక్క వివరణ:

... 522509 లోని 267.02 చ.మీ.లు అనగా 319.36 చ.గ.ల విస్తీర్ణంతో ప్లాట్ నెంబరు 20 యొక్క మొత్తం భాగం, మరియు, సరిహద్దులుగా: తూర్పు: 20'0" వెడల్పు రోడ్డు (6.40 మీటర్లు), పడమర: ప్లాట్ నెం.లు 18 & 19 (22.55 మీ.లు), ఉత్తరం: ప్లాట్ నెం.21 (18.28 మీ.లు), దక్షిణం: 40'0" వెడల్పు రోడ్డు (24.38 మీ.లు)

సం/- అధీకృత అధికారి
తేది : 03-01-2025 — ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు
రుణ ఖాతా నెం: 68766858. — ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమాల్గమేట్ చేయబడినది)

Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత: 1. శ్రీమతి గడ్డం వెంకట రమణమ్మ, భర్త: జి.లక్ష్మీ నరసారెడ్డి, డి.నెం.6-223/1-1, శ్రీ లక్ష్మీ నాగసాయి రెసిడెన్సీ, బడేవారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, రామవరప్పాడు, విజయవాడ-521108, తనఖాదారు: 2. శ్రీమతి గడ్డం వెంకట రమణమ్మ, భర్త: జి.లక్ష్మీ నరసారెడ్డి, డి.నెం.6-223/1-1, శ్రీ లక్ష్మీ నాగసాయి రెసిడెన్సీ, బడేవారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, రామవరప్పాడు, విజయవాడ-521108, సహ-పూచీదారు: శ్రీ గడ్డం లక్ష్మీ నరసారెడ్డి, తండ్రి: గడ్డం చంద్రారెడ్డి, డి.నెం.6-223/1-1, శ్రీ లక్ష్మీ నాగసాయి రెసిడెన్సీ, బడేవారి వీధి, వాటర్ ట్యాంక్ దగ్గర, రామవరప్పాడు, విజయవాడ-521108.

విషయం : బ్యాంక్ వారికి శ్రీమతి గడ్డం వెంకట రమణమ్మ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, సెక్షన్ 13(2) క్రింద ది.04-06-2021న డిమాండ్ నోటీసు ...

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.
తేది : 03-01-2025

Union Bank of India

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

...

తేది : 03-01-2025 — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏపీ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : 1) మెస్సర్స్ లలిత కాటన్ ట్రేడర్స్, ప్రొ।। శ్రీమతి తోట పద్మావతి, భర్త : ...

షెడ్యూల్ ఆస్తి

...

తేది : 30-12-2024 — చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

CIN: U67100Mh2007PLC174759
రిటైల్ సెంట్రల్ & రిజిస్టర్డు ఆఫీసు: ఇడెల్‌వీస్ హౌస్, ఆఫ్ సిఎస్‌టి రోడ్, కలినా, ముంబయి-400098

ఇ-వేలం ప్రకటన రద్దు

ఈ వార్తా పత్రికలో 28 డిసెంబర్, 2024న ప్రచురించబడిన సదరు ఆస్తి యొక్క వేలం ప్రకటనకు ఈ ఇ-వేలం నోటీసు యొక్క రద్దు జారీ చేయబడింది. రుణ నెం: 02400005793/PHFLలో రుణగ్రహీత 1) శ్రీ.కిరణ్ కుమారి చప్పిడి ("రుణగ్రహీత") 2) శ్రీ.విజయ్ కుమార్ కొంగల ("సహ-రుణగ్రహీత") కు సంబంధించినది.

రుణగ్రహీతకు సంబంధించినది.

ఏపి సిఆర్‌డిఏ ఆమోదిత లేఅవుట్ నెం: 11/2016/విజేఏ, కిరణ్ బాబు డ్రీమ్ సిటీ ఫేజ్ 2, కొమరవోలు గ్రామం, పామర్రు మండలం కృష్ణా జిల్లా పామర్రు సబ్-రిజిస్ట్రీ పరిధిలో మరియు జిల్లా విజయవాడ తూర్పు సబ్-జెజిస్ట్రీ అధికార పరిధిలోని ఎక 1.64 సెంట్ల పూర్తి విస్తీర్ణంలోని ఆర్.ఎస్.నెం.196/1 లోని 181 చ.గ.ల విస్తీర్ణంలో, ప్లాట్ నెం: 83లో ఉన్న ఆస్తి కోసం 21.01.2025న ఇ-వేలం షెడ్యూల్ చేయబడిందని సాధారణ ప్రజలకు తెలియజేయడం కోసం ఇది ఉద్దేశించబడింది. సరిహద్దులు: తూర్పు: ఇతరుల ఆస్తి 30-0అ.లు, దక్షిణం: ప్లాట్ నెం: 84 యొక్క 54-5 అ.లు, పడమర: 40-అ.ల వెడల్పు రోడ్డు-30.0 అ.లు, ఉత్తరం: ప్లాట్ నెం: 82 యొక్క 53.8అ.లు. పై సరిహద్దుల మధ్య ప్లాట్ నెం:83కి సబంధించి విస్తీర్ణం181 చ.గజాలు, లేఅవుట్ ప్లాన్‌లో చూపబడిన అన్ని సౌలభ్యం హక్కులతో తక్షణ ప్రభావంతో రద్దు చేయబడింది.

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా దేశంలోకి విదేశీ పెట్టుబడుల రాక తగ్గిపోతోంది. అదే సమయంలో విదేశీ సంస్థలు తమ వద్ద ఉన్న నిధులను స్వదేశాలకు తరలించడం, పెట్టుబడులను ఉపసంహరించుకోవడం పెరుగుతోంది. దేశీయ కంపెనీలు సైతం ఎక్కువగా విదేశాల్లోనే పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐలు) ప్రవాహం గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 12 శాతం మేర పడిపోయింది. పెట్టుబడుల్లో నెలకొన్న స్తబ్దతకు తోడు కంపెనీలు తమ స్వదేశాలకు నిధులను తరలించడం ఆందోళన కలిగించే విషయమే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ భారతీయ కంపెనీలు విదేశాల్లో గణనీయంగా పెట్టుబడులు పెట్టాయని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి.

2021-22 నుండి తిరోగమనం

ప్రపంచంలో నెలకొన్న ఆర్థిక అస్థిరత నేపథ్యంలో పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థ కంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయంగా కన్పిస్తుండడంతో విదేశీ కంపెనీలు తమ డబ్బును తరలిస్తున్నాయని, భారతీయ కంపెనీలేమో విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయని ఆర్థికవేత్తలు విశ్లేషించారు. 2011-12 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో దేశంలోకి 16.9 బిలియన్ డాలర్ల నికర ఎఫ్‌డీఐలు రాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదే కాలానికి 14.5 బిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయి. 2020-21 వరకూ నికర ఎఫ్‌డీఐలు గణనీయంగా పెరగ్గా (34 బిలియన్ డాలర్లు) ఆ తర్వాత బాగా తగ్గుముఖం పట్టాయి. 2021-22లో 32.8 బిలియన్ డాలర్లు, 2022-23లో 27.5 బిలియన్ డాలర్లు, 2023-24లో 15.7 బిలియన్ డాలర్ల నికర ఎఫ్‌డీఐలు మాత్రమే వచ్చాయి. స్థూల ఎఫ్‌డీఐలకు, స్వదేశానికి తరలిపోయిన లేదా పెట్టుబడుల ఉపసంహరణ జరిగిన సొమ్ముకు మధ్య ఉన్న వ్యత్యాసాన్నే నికర ఎఫ్‌డీఐలు అంటారు.

తరలిపోతున్న సంపద

2012-13లో అత్యంత స్వల్పంగా 13.8 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు మాత్రమే రాగా ఆ తర్వాత 2023-24లోనే అతి తక్కువగా నికర ఎఫ్‌డీఐలు నమోదయ్యాయి. 2011-12, 2024-25 (ఏప్రిల్-అక్టోబర్) మధ్యకాలంలో స్థూల ఎఫ్‌డీఐలు స్థిరంగా ఉండగా దేశం నుండి తరలిపోయిన పెట్టుబడులు బాగా పెరిగాయి. నికర ఎఫ్‌డీఐలు తగ్గడానికి ప్రధాన కారణం దేశం నుండి విదేశాలకు నిధులు తరలిపోవడమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో దేశం నుండి బయటికి వెళ్లిన సొమ్ము 34.1 బిలియన్ డాలర్లు. గత సంవత్సరం ఇదే కాలంలో ఇది 26.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దేశం నుండి తరలిపోతున్న పెట్టుబడులు 2017-18 నుండి పెరుగుతూనే ఉన్నాయి. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) మందగించడం, కార్పొరేట్ లాభాలు పడిపోవడం ఈ పరిస్థితికి కారణమని ఈవై ఇండియా ప్రధాన విధాన సలహాదారు డీకే శ్రీవాత్సవ తెలిపారు. 'ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం భారత్‌కు అనుకూలంగా లేదు. ఎగుమతులు, పెట్రోలియం ధరలు, సరఫరాలకు సంబంధించి మనం ఇప్పుడు క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాము. ఇప్పుడు ప్రపంచంలో సౌకర్యవంతంగా ఉన్న ఏకైక ఆర్థిక వ్యవస్థ అమెరికాయే' అని ఆయన చెప్పారు.

'ప్రస్తుతం నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, అమెరికా ఎన్నికల ఫలితాల కారణంగా పెట్టుబడిదారుల వైఖరిలో మార్పు వచ్చింది. ఫలితంగా దేశంలోని సొమ్ము డాలర్ల రూపంలో ఆస్తులుగా మారిపోతోంది' అని న్యూఢిల్లీలోని గ్రాంట్ థ్రాన్‌టన్ భారత్ సంస్థ భాగస్వామి రిషి షా తెలిపారు. సెక్యూరిటీల మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ప్లాంట్లు, ఫ్యాక్టరీల వంటి వాస్తవిక ఆస్తుల్లో కూడా ప్రత్యక్ష పెట్టుబడులు పెడుతున్నారని ఆయన చెప్పారు. కాగా అధికారిక గణాంకాల ప్రకారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు...ఒక దేశానికి చెందిన పెట్టుబడిదారు మరో దేశంలో స్టాక్స్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఆస్తులు కొనుగోలు చేస్తే అతనిని ఎఫ్‌పీఐ అంటారు) గత సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో భారతీయ మార్కెట్ల నుండి రూ.2.5 లక్షల కోట్లను తరలించారు.

దేశీయ కంపెనీలదీ అదే దారి

ఇదిలావుంటే పులి మీద పుట్రలా భారతీయ కంపెనీలు కూడా పక్క చూపులు చూస్తున్నాయి. 2011-12 ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో భారతీయ కంపెనీలు విదేశాల్లో 6.5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో12.4 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాయి. 2011-12 తర్వాత ఈ స్థాయిలో భారతీయ కంపెనీలు విదేశాల్లో పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య దేశీయ కంపెనీలు విదేశాల్లో పెట్టిన పెట్టుబడులు ఎనిమిది బిలియన్ డాలర్లు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో అవి ఏకంగా 55 శాతం పెరిగాయి. ప్రపంచంలో ఎక్కడ చూసినా ఆర్థిక అస్థిరత కొనసాగుతోందని, ఇప్పుడు పోటీ మొత్తం భారత్, అమెరికా మధ్యేనని శ్రీవాత్సవ చెప్పారు. చైనా, యూరప్ వ్యవస్థలు ఆకర్షణీయంగా లేవని, స్వల్పకాలంలో భారత్ కంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ మంచి పనితీరు కనబరుస్తుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారని వివరించారు. వాణిజ్యాన్ని వేగవంతం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా భారతీయ కంపెనీలు విదేశాల్లో పెట్టుబడి పెడుతున్నాయని షా అభిప్రాయపడ్డారు.

మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ఇనుప ఖనిజం సరఫరా చేయండి

- కేంద్ర మంత్రి హెచ్‌డి కుమార స్వామికి రాష్ట్ర మంత్రి టిజి భరత్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్సెలార్ మిట్టల్‌కు ఇనుప ఖనిజం సరఫరా చేయాలని రాష్ట్ర మంత్రి టిజి భరత్ కోరారు. సోమవారం నాడిక్కడ కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామి, ఉక్కు శాఖ కార్యదర్శితో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆర్సెలార్ మిట్టల్‌కు ఐరన్ ఖనిజం సరఫరాపై చర్చించారు. దీనికి కేంద్ర మంత్రి ఎంతో సానుకూలంగా స్పందించారని మంత్రి టిజి భరత్ తెలిపారు. ఈ ఒప్పందం సులభతరం చేయడంలో సహకరించినందుకు కేంద్ర మంత్రి హెచ్‌డి కుమార్ స్వామికి మంత్రి భరత్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నాయకత్వానికి, దార్శనికతకు ఈ ప్రగతి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరిగేలా కృషి చేస్తామని టిజి భరత్ అన్నారు.

హౌతీ తీవ్రవాదుల పరిశీలనలో నిమిష ప్రియ కేసు

- యెమెన్ ఎంబసీ వెల్లడి

సానా : కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియ మరణశిక్షను యెమెన్ అధ్యక్షుడు రషిద్ అల్ అలిమి ధృవీకరించారన్న వార్తలను యెమెన్ ఎంబసీ తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి ఇటీవల వచ్చిన వార్తలపై స్పందిస్తూ సోమవారం ఎంబసీ ఒక ప్రకటన జారీ చేసింది. రాజధాని సానాలో సెంట్రల్ జైల్లో వున్న నిమిష ప్రియ మరణశిక్షను ఎదుర్కొంటున్నారు. ఈ మొత్తం కేసు వ్యవహారాలను హౌతీ తీవ్రవాదులే చూస్తున్నారని యెమెన్ ప్రభుత్వం తెలియచేసింది. అందువల్ల ఆమె మరణశిక్షను అధ్యక్షుడు ధృవీకరించలేదని పేర్కొంది. కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నిమిష ప్రియ 2017లో యెమెన్ జాతీయుడిని హత్య చేసిన కేసులో జైలు శిక్షను అనుభవిస్తున్నారు. 2020లో ఆమెకు విచారణా కోర్టు మరణశిక్షను విధించింది. 2023 నవంబరులో ఆమె పెట్టుకున్న అప్పీల్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. అయితే బాధితుడి కుటుంబంతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించిన పక్షంలో ఈ శిక్ష రద్దయ్యే అవకాశాలు వున్నాయి. దానికోసం ఆమె తల్లి కృషి చేస్తున్నారు. ఈలోగా తాము చేయగలిగే సాయమంతా చేస్తామని గతేడాది డిసెంబరు 31న భారత ప్రభుత్వం హామీ ఇచ్చింది.

షేక్ హసీనాపై రెండో అరెస్ట్ వారెంట్

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రిపై ఆ దేశపు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్(ఐసిటి) మరోసారి అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకు గానూ ఆమెతో పాటు మరో 12 మందికి ఈ వారెంట్ జారీ చేసింది. హసీనా రక్షణ సలహాదారు మేజర్ జనరల్ (రిటైర్డ్) తారిక్ అహ్మద్ సిద్ధిఖీ, మాజీ ఐజీ బెనజీర్ అహ్మద్, మాజీ నేషనల్ టెలికమ్యూనికేషన్ మానిటరింగ్ సెంటర్ డీజీ జియావుల్ అహ్‌సాన్ వంటి వారు కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరందరినీ ఫిబ్రవరి 12వ తేదీలోపు కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని ఆదేశించింది.

ఇది మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానమే: కాంగ్రెస్

న్యూఢిల్లీ : దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేటు రంగం నిరాకరించడమంటే అది నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్ల కార్పొరేట్ తరహా అవిశ్వాస తీర్మానమేనని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు సోమవారం పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాబోయే కేంద్ర బడ్జెట్‌లో దేశీయ పెట్టుబడులకు ఉత్తేజం కల్పించడం, నిలకడగా కొనసాగేలా చూడడంపై ప్రభుత్వం దృషి పెట్టాలని కోరారు. మోడీ దశాబ్ద పాలనలో దేశంలో పెట్టుబడుల వాతావరణం మందకొడిగా సాగుతోందన్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో స్థూల స్థిర మూలధన నిర్మాణం జిడిపిలో 32శాతంగా వుండగా, గత పదేళ్ళలో మోడీ ప్రభుత్వ హయాంలో ఇది 29శాతానికంటే దిగువకు పడిపోయిందన్నారు.

ప్రజా వినిమయం వేగం పుంజుకోకపోవడం, అలాగే పన్ను అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూ వ్యాపార, వాణిజ్యాలకు అవరోధం కలిగించడం, మోడీ హయాంలో కేవలం నాలుగైదు వ్యాపార గ్రూపులే ఎదుగుతున్నాయనే భావన పెరగడం వీటన్నింటి కారణంగా పెట్టుబడులు మందగించాయన్నారు. తాజాగా ప్రైవేటు రంగం దేశంలో పెట్టుబడులు పెట్టడానికి తిరస్కరించడం మరో సాక్ష్యాధారమని రమేష్ చెప్పారు. 2024 ఏప్రిల్-అక్టోబరులో 12ఏళ్ళ కనిష్ట కాలానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) పడిపోయాయని ఒక వార్తా కథనాన్ని ఉటంకిస్తూ రమేష్ పేర్కొన్నారు. దేశంలో కన్నా విదేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకే భారతీయ సంస్థలు సుముఖత చూపిస్తున్నాయన్నారు. ఇది మోడీ ప్రభుత్వంపై కార్పొరేట్లు పెట్టే అవిశ్వాస తీర్మానమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎఫ్‌డిఐలు చాలా ముఖ్యమని, కానీ దేశీయ పెట్టుబడులు మరింత ప్రాధమికమైనవని ఆయన పేర్కొన్నారు. మరో 26 రోజుల తర్వాత ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో దేశీయ పెట్టుబడులకు మరింత ఉత్తేజితం కల్పిస్తూ, సుస్థిరంగా కొనసాగేలా చూడడం ఎలా అన్న అంశంపై దృష్టి పెట్టాలన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రియుల పాదయాత్ర

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

'పుస్తకం మాత్రమే శాశ్వతం.. పుస్తకం చదివితే కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతుంది. మీలోని ఊహాశక్తి పెరుగుతుంది' అని విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, పుస్తక ప్రియులు, కవులు, కళాకారులు, రచయితలు, అభ్యుదయవాదులు తదితరులు కదం తొక్కారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ఐదోరోజైన సోమవారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకూ పుస్తక ప్రియులతో భారీ ప్రదర్శన జరిగింది.

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన మార్గం లేదని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... పిల్లలు మంచి పుస్తకాలను ఎంపిక చేసుకోవడం నేర్చుకోవాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో ముద్రించిన పుస్తకానికి కాలం చెల్లిందనేది అవాస్తవని తెలిపారు. సాహితీవేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత పెనుగొండ లక్ష్మీనారాయణ, సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్,సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ శ్రీనివాస్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాటికన్‌లో తొలి మహిళా ప్రీస్ట్‌గా సిస్టర్ షిమోనా

- ప్రకటించిన పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ : ప్రధానమైన వాటికన్ కార్యాలయ నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు ఒక మహిళ పేరును పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ప్రకటించారు. కేథలిక్ చర్చి జారీ చేసే మతపరమైన ఆదేశాలన్నింటికీ ఈ కార్యాలయమే బాధ్యురాలని, ఇటలీకి చెందిన నన్ సిస్టర్ షిమోనా బ్రాంబిల్లా ఈ బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చర్చి పాలనా వ్యవహారాల్లో మహిళా నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మరింత మంది మహిళలు ఇందులోకి రావాలన్నది ఫ్రాన్సిస్ లక్ష్యంగా వుంది. ఆ దిశగా ఈ నియామకం ప్రధాన చర్యగా భావిస్తున్నారు. కొన్ని వాటికన్ కార్యాలయాల్లో నెంబర్ 2 స్థానంలో మహిళలను నియమించినప్పటికీ కేథలిక్ చర్చికి కీలక పాలనా విభాగమైన హోలీ సీ క్యూరియా సమావేశానికి ఒక మహిళను ప్రిఫెక్ట్‌గా లేదా ప్రీస్ట్‌గా ఎన్నడూ నియమించలేదు. చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న బ్రాంబిల్లా నియామకాన్ని వాటికన్ మీడియా ధృవీకరించింది. వాటికన్‌లో తొలి మహిళా ప్రీస్ట్ సిస్టర్ షిమోనా బ్రాంబిల్లా అని తన వార్తా కథనంలో వ్యాఖ్యానించింది.

కెనడా ప్రధాని ట్రూడో రాజీనామా

ఒట్టావా: కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తన పార్టీ లిబరల్ పార్టీ ఆఫ్ కెనడాలో వెల్లువెత్తుతున్న అసమ్మతి, ఒత్తిడి కారణంగా ట్రూడో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒట్టావాలోని రైడో కాటేజ్‌లో తన నివాసం వెలుపల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ఆయన ప్రకటించారు. 'పార్టీ నాయకత్వ బాధ్యతలతో పాటు కెనడా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశాను. ఈ విషయాన్ని పార్టీకి, గవర్నర్‌కు తెలియచేశాను' అని ట్రూడో ప్రకటించారు. కెనడాలో ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 20లోగా ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. ఇలాంటి నేపథ్యంలో ట్రూడో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని పలు ఒపియన్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీకి ప్రజల నుంచి మద్దతు పెరుగుతుందని పోల్స్ వెల్లడిస్తున్నాయి. కాగా, ప్రధానమంత్రి పదవికి ట్రూడో రాజీనామా చేసిన ఈ పదవిలో ఆయన మరికొన్ని రోజులు పాటు కొనసాగే అవకాశం ఉంది. పార్టీ కొత్త నాయకుడ్ని, ప్రధాన్ని ఎన్నుకునే వరకూ ట్రూడో ఈ పదవిలో ఉంటారు. కెనడా చట్టాల ప్రకారం అధికార పార్టీ నాయకుడు

రాజీనామా చేసిన తేదీ నుంచి ప్రత్యామ్యాయాన్ని కనుగొనడానికి 90 రోజులు సమయం లభిస్తుంది. ట్రూడో 2015లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పదేళ్ల కాలంలో ప్రారంభంలో ప్రధానిగా ట్రూడోకు ప్రజల మద్దతు లభించినా, ఇటీవల కాలంలో ప్రజా వ్యతిరేకత తీవ్రంగా పెరిగింది. ముఖ్యంగా వృద్ధి మందగించడం, అధిక ద్రవ్యోల్బణం, స్తబ్దుగా ఉన్న జిడిపి, వాణిజ్య విధానాలు వంటి అంశాలు ట్రూడోపై వ్యతిరేకత పెరగడానికి కారణాలు పెరిగాయి. అలాగే కెనడా అమెరికాకు 51వ రాష్ట్రంగా ఉండాలని ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా ట్రూడో ఇబ్బందిగా మారాయి.

కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే 34మందిని విడుదల చేస్తాం

- హమాస్ వెల్లడి
- మరో రెండు వారాల్లో ఒప్పందం : అమెరికా ఆశాభావం

గాజా : ఇజ్రాయిల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లైతే మొదటి దశలో భాగంగా 34మంది బందీలను విడుదల చేసేందుకు సిద్ధంగా వున్నామని హమాస్ అధికారి ఒకరు తెలిపారు. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకు నెలల తరబడి మధ్యవర్తులు కతార్, ఈజిప్ట్, అమెరికాలు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా కతార్‌లో కాల్పుల విరమణ, బందీల విడుదలపై ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు పునరుద్ధరించినట్లు ఇజ్రాయిల్ తెలిపింది. ఈ నెల 20న బైడెన్ స్థానే ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో తాజా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. 2023 నవంబరులో వారం రోజుల పాటు కాల్పుల విరమణ జరిగినపుడు 80మంది ఇజ్రాయిలీ బందీలు విడుదల కాగా, ఇజ్రాయిల్ జైళ్ళలో మగ్గుతున్న 240మంది పాలస్తీనా ఖైదీలు విడుదలయ్యారు. తాజాగా ఇజ్రాయిల్ అందచేసిన జాబితాలో 34మంది ఇజ్రాయిల్ ఖైదీలను విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించింది. బందీల జాబితాను హమాస్ ఇంకా అందచేయాల్సి వుందని నెతన్యాహు కార్యాలయం తెలిపింది. ఈ విషయంపై తనకు మాట్లాడేందుకు అధికారం లేదని, కానీ తాజా జాబితాలో మహిళలు, పిల్లలు, వృద్ధులు, జబ్బు పడినవారు వుంటారని చెప్పారు. బందీలతో మాట్లాడాలన్నా ఎవరు జీవించి వున్నారు,. ఎవరు మరణించారో గుర్తించాలన్నా కూడా తమకు ఒక వారం సమయం కావాలని హమాస్ పేర్కొంది. హమాస్ అధికారి వ్యాఖ్యలు వెలువడినా చర్చలపై ఇంతవరకు ఎలాంటి అప్‌డేట్ లేదు.



బందీల విడుదల కోసం ఇజ్రాయిల్‌లో ఆందోళనలు

ముగ్గురు మృతి

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిలీలు ప్రయాణిస్తున్న బస్సుపై కాల్పులు జరగడంతో ముగ్గురు మరణించారని ఇజ్రాయిల్ సహాయక సేవల బృందం తెలిపింది. మరో ఆరగురు గాయపడ్డారని వెల్లడించింది. పాలస్తీనా గ్రామం అల్ ఫండూక్‌లో ఈ దాడి జరిగింది. కాల్పులకు పాల్పిడిన వారిని, మరణించిన వారిని ఇంకా గుర్తించలేదు.

బ్లింకెన్ ఆశాభావం

త్వరలోనే గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందన్న విశ్వాసాన్ని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వ్యక్తం చేశారు. అయితే జనవరి 20న ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టిన తర్వాతనే జరగడానికి అవకాశాలు వున్నాయన్నారు. బందీల విడుదలకు ఒప్పందం కుదర్చడానికి బైడెన్ సర్కార్ చివరి వరకు ప్రయత్నిస్తూనే వుంటుందని చెప్పారు. మరోరెండు వారాల్లో పరిస్థితులన్నీ కొలిక్కి వస్తాయని చెప్పారు.

బిజెపి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ప్రియాంక, అతిషిలపై అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండించిన సిపిఎం
- రమేష్ బిధూరిపై కఠిన చర్యలకై డిమాండ్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషిలపై బిజెపి నేత రమేష్ బిధూరి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఇటువంటి మహిళా వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన రమేష్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే ఇటువంటి ప్రకటనలు చేస్తున్నందుకు బిజెపి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కోరింది. ఈ మేరకు సిపిఎం ఒక ప్రకటన జారీ చేసింది. రమేష్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే మహిళల పట్ల బిజెపి సంకుచిత మనస్తత్వ ధోరణి బయటపడుతోందని విమర్శించింది. ఢిల్లీ ఎన్నికల సమయంలో వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకే బిజెపి ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోందని పార్టీ విమర్శించింది. గతంలో పార్లమెంట్‌లో పార్లమెంట్ సభ్యుడు డానిష్ అలీపై కూడా రమేష్ బిధూరి మతోన్మాద, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది. బిజెపి నిజమైన స్వభావం, వ్యవహార శైలి, ఎజెండా వంటి విషయాలను ఈ సంఘటన చాలా స్పష్టంగా వెల్లడించిందని సిపిఎం పేర్కొంది. ఈ విషయమై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడం చూస్తుంటే దీనంతటికీ ఆయన ఆమోద ముద్ర వుందని అనిపిస్తోందని ఆ ప్రకటన పేర్కొంది. మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహించడమే బిజెపి విధానమని స్పష్టమవుతోందని విమర్శించింది. ప్రజాస్వామ్య విలువలపై, దేశం యొక్క పార్లమెంటరీ ప్రతిష్టపై నేరుగా దాడి చేయడమేనని విమర్శించింది.

ద్రవ్యోల్బణం, యువత నిరుద్యోగం, రేషనింగ్ వ్యవస్థ క్షీణించడం, కనీస వేతనాల అమల్లో వైఫల్యం, క్షీణిస్తున్న శాంతి భద్రతలు ముఖ్యంగా మహిళలపై పెరుగుతున్న నేరాలు వంటి ప్రజలెదుర్కొంటున్న వాస్తవిక సమస్యలపై దృష్టిని మళ్ళించవద్దని ఢిల్లీ ఓటర్లకు సిపిఎం విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ముందు ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, ప్రజల దృష్టిని మళ్లించడం ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఎత్తుగడల్లో భాగమేనని విమర్శించింది.

వైద్య చికిత్సకు సహకరించండి

- రైతు నేత దల్లేవాలేను కలిసిన సుప్రీం కమిటీ

చండీఘడ్ : కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించడంతో సహా రైతుల డిమాండ్ల సాధన కోసం గత 40 రోజుల నుండి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్‌జిత్ దల్లెవాలేను సుప్రీం కోర్టు నియమించిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం కలుసుకుని, వైద్య చికిత్సకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. ఆందోళన చేస్తున్న రైతుల ఇబ్బందులను సామరస్యంగా పరిష్కరించే లక్ష్యంతో గతేడాది సెప్టెంబరులో సుప్రీం కోర్టు ఈ కమిటీని ఏర్పాటు చేసింది. దల్లేవాల్‌తో సమావేశానంతరం మీడియానుద్దేశించి జస్టిస్ నవాబ్ సింగ్ ప్రసంగించారు. దల్లేవాల్ ఆరోగ్యంగా వుండాలని తాము కోరుకుంటున్నట్లు ఆయనకు తెలియచేశామని చెప్పారు. వైద్య సాయం తీసుకోవడానికి ఆయన అంగీకరించారా అని ప్రశ్నించగా, తాము పదే పదే విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఆయన ఆరోగ్యం బాగుండాలనేదే మేం కోరుకునదని అన్నారు. ఆందోళన ముగుస్తుందని చెప్పడానికి ఈ రోజు తానిక్కడకు రాలేదన్నారు. ముందు వ్యవసాయం, తర్వాతే తన ఆరోగ్యమని దల్లేవాల్, కమిటీకి తెలియచేశారని నవాబ్ సింగ్ తెలిపారు. ఎవరెంత చెప్పినా దల్లేవాలే వైద్య చికిత్స తీసుకోవడానికి నిరాకరిస్తుండడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. సాయంత్రం 3.30గంటల సమయంలో ఖానౌరి నిరసన శిబిరం వద్దకు కమిటీ చేరుకుని దల్లేవాలేతో భేటీ అయింది.

మోహన్ బాబు పిటిషన్‌పై విచారణ వాయిదా

- 9న విచారణ చేపడతామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జర్నలిస్ట్ పై దాడి కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈనెల 9న విచారణ చేపడతామని స్పష్టం చేసింది. గతేడాది డిసెంబర్ 10 న జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జర్నలిస్ట్ దాడి కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ మోహన్ బాబు దాఖలు రాష్ట్ర హైకోర్టు ను ఆశ్రయించారు. డిసెంబర్ 23న ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పోలీసులు నమోదు చేసిన కేసులో అభియోగాలు తీవ్రమైనందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మోహన్ బాబు డిసెంబర్ 24న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ను సోమవారం జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా... సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి అందుబాటులేరని, ఇతర కోర్టులో వాదనలు కొనసాగిస్తున్నందున పిటిషనర్ మోహన్ బాబు తరపు న్యాయవాదులు పాస్ ఓవర్ కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. కొద్ది సేపటికి ముకుల్ రోహిత్గి ధర్మాసనం ముందుకు చేరుకున్నప్పటికీ... వాదనలు వినేందుకు బెంచ్ అంగీకరించలేదు. తదుపరి విచారణను ఎల్లుండి(ఈనెల 9వ) తేదికి వాయిదా వేసింది.

అసత్యాల శంఖారావం...

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన, ఉప కథల్లో కనిపించే అనేక ఉదంతాలను ఉటంకిస్తూ, వర్ణాధిపత్యాన్ని చీల్చి చెండాడిన వైనం ఇప్పటికీ మనువాదులకు జీర్ణం కాదు. బహుశా అలాంటి ధోరణితోనే అనంత్ శ్రీరామ్ అంతగా ఆవేశపడ్డారు. భారత రామాయణ కథలు దేశంలోనూ, దేశం బయటా ఒకరి నుంచి ఒకరికి నోటి ద్వారానే ప్రచారం అయ్యాయని, తరువాతి కాలంలో రకరకాలుగా గ్రంథస్థం అయ్యాయని అనంత్ శ్రీరామ్‌కి తెలీదని అనుకోలేం. భారత ఉపఖండంలో 120కి పైగానే రామాయణ కథలు ప్రచారంలో ఉన్నాయి. అవి దేనికది ప్రత్యేకం తప్ప ఒకదానిని మరొకటి అవమానించటమో, తక్కువ చేయటమో కాదు. అనేక ద్వంద్వార్థ పాటలను ప్రస్తావిస్తూ, 'ఈ గురివిందా, నీతులు చెప్పేది?' అంటూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంకా విశ్వహిందూ పరిషత్ నేతలు, ఇతరులు ఈ వేదిక పైనుంచి హిందువులను భయపెట్టి, రెచ్చగొట్టే విధంగా లవ్ జీహాద్ అంటూ అపోహలను గుప్పించారు. కలసి మెలసి జీవిస్తున్న చోట కులాంతర, మతాంతర వివాహాలు సహజం. కానీ, పరివార్ శక్తులు లవ్ జీహాద్ అంటూ చాలాకాలంగా దుష్ప్రచారం చేస్తున్నాయి. హిందూ యువతీ యవకులు నిరుద్యోగంతో నిర్వీర్యం అవుతున్నా, మహిళలు అకృత్యాలకు అన్యాయాలకు గురవుతున్నా, ధరలు పెరిగి జీవనం అస్తవ్యస్తం అవుతున్నా, రైతులు నిత్యం సమస్యలతో సతమతం అవుతున్నా వారి పక్షాన నోరెత్తని విశ్వ హిందూపరిషత్ ఆలయాలను తమ గుప్పిట్లోకి తెచ్చుకోవటానికి నానా అబద్ధాలతో ఆరాటపడడం ఈ శంఖారావంలో స్పష్టంగా వినిపించింది. ఈ సభలో రాష్ట్రంలోని బిజెపి ఎంపీలు, కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, బిజెపి నుంచి ఎన్నికల్లో పోటీ చేసినవారూ పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ రెచ్చగొట్టుడు శంఖమూదారో ఈ దృశ్యం చెప్పకనే చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లోని సామరస్యాన్ని దెబ్బ తీసి, మతోన్మాద శక్తులను అందలం ఎక్కించాలనేది ఈ పరివార్ పన్నాగం. రాష్ట్ర ప్రజలు ఆ పన్నాగాలను, ప్రయత్నాలను గుర్తిస్తారు.

ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఎన్‌ఇపి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా నేటికీ వివక్షతను కుటుంబ స్థాయి నుంచీ ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహిళలపై ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.కమలకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనంతో అభివృద్ధి : సాహితీ సదస్సులో కె.మోహన్

సాహిత్యం, అధ్యయనం ద్వారానే అభివృద్ధి సాధ్యమని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కె.మోహన్ అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్.కుమార రాజా అధ్యక్షతన జరిగిన సాహితీ సదస్సులో ఆయన మాట్లాడారు. తరగతి గదుల్లో బోధించే పాఠ్యపుస్తకాలకు మతం రంగు పులుముతున్నారన్నారు. లౌకికతత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. అశాస్త్రీయ పాఠ్యాంశాలపై పోరాడాలన్నారు. సామ్రాజ్యవాద విష కౌగిలి నుంచి దేశాన్ని బయట పడేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని తెలిపారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ చేతులు జోడించడం ద్వారా కాకుండా, చేతులు బిగించడం ద్వారా అభివృద్ధి చెందుతామన్నారు. అనంతరం అట్టాడ అప్పలనాయుడు రచించిన 'నక్షత్ర బాట' పుస్తకాన్ని, కె.మోహన్ రచించిన 'చెమట చెక్కిన వాక్యం' పుస్తకాలను కెఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు.

మీకోసం

బట్టలపై నూనె ఒలికితే ఉప్పు అద్దిన నిమ్మకాయ ముక్కతో రుద్దాలి.

జీవన సౌరభం

లక్ష్యం అవకాశం కాదు.. ఎదురు చూడాల్సిందీ కాదు.. ఎన్నుకోవాల్సింది.

తల్లి ప్రేమ

గంగాపురం అనే ఊరి పక్కన ఒక అడవి ఉంది. ఆ ఊరి బయట గుడిసెలో మల్లవ్వ, రాజయ్య అనే దంపతులు నివసిస్తున్నారు. వారికి ఒక చిన్న పాప ఉంది. ఆమె పేరు లిల్లీ. ఒక రోజు రాజయ్య పొలం పనులకు వెళ్ళాడు. మల్లవ్వ గుడిసెలో ఇంటి పని చేస్తోంది. లిల్లీ గుడిసె ముందు ఆడుకుంటోంది. ఇంతలో అడవి నుండి ఆహారం వెతుకుతూ పులి గుడిసె దగ్గరకు వచ్చింది. పులిని చూసి లిల్లీ భయపడి ఏడ్చింది. లిల్లీ ఏడుపు విని మల్లవ్వ గుడిసె బయటకు వచ్చింది. వెంటనే లిల్లీని ఎత్తుకుని పరుగెత్తింది. పులి, మల్లవ్వ వెంట పరుగెత్తింది. మల్లవ్వ ఊరిలోకి పరుగెత్తింది. పులి కూడా మల్లవ్వను వెంబడించింది. చాలా దూరం నడవలేక మల్లవ్వ కింద పడింది. తను చనిపోయినా బిడ్డ బతకాలని పక్కనే ఉన్న గోడపై నుండి లిల్లీని కిందకు దించింది. బిడ్డ క్షేమంగా ఉందన్న ధైర్యంతో ఒక్క కర్ర పట్టుకుని పులికి ఎదురుగా నిలబడింది.

పులి మల్లవ్వపై దాడి చేసింది. గాయాల పాలు చేసింది. ఈలోగా ఊరి వారందరు కర్రలు పట్టుకుని వచ్చారు. వారిని చూసి పులి భయపడి అడవిలోకి పారిపోయింది. అందరు కలిసి మల్లవ్వను ఆసుపత్రికి తీసుకెళ్ళారు. పులిని ఎదిరించి బిడ్డను కాపాడుకున్న తల్లి ప్రేమ గొప్పదని మల్లవ్వని అందరు మెచ్చుకున్నారు.

నీతి : ఆపదలో ధైర్యాన్ని కలిగి ఉండాలి.

బి.సిరి చందన,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

సరైన నీడ ఏది?

పిల్లలూ, ఇక్కడ తెల్లని బాతు ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు : 5





నేను గీసిన బొమ్మ

ఇ.ప్రణయ్,
10వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్,
దూలిమిట్ట,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చిన్న దేశం .. పెద్ద సందేశం ...

ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా, ఎక్కడైనా అవినీతిని ఉపేక్షించకూడదు. నిర్లక్ష్యంగా ఉంటే, అది వ్యవస్థలన్నింట్లో జొరబడి ప్రజలకు హాని చేస్తుంది. చాలామందికి అది తెలిసినా మిన్నకుండిపోతారు. 'మాకెందుకులే' అని రాజీపడిపోతారు. కానీ.. యూరప్ ఖండంలోని సెర్బియా దేశంలో ఇటీవల అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. దేశం యావత్ ఒక్కతాటిపైకి వచ్చింది. ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అసలు ఏం జరిగింది?

నవంబరు 1న సెర్బియా దేశంలోని 'నోవీ సాడ్' రైల్వే స్టేషనులో ఓ ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న స్టేషను రూఫ్ విరిగిపడి అక్కడికక్కడే 14 మంది చనిపోయారు. ఆ తరువాత కొన్ని రోజులకు చికిత్స పొందుతూ మరొకరు బలయ్యారు. వారంతా 6 నుంచి 74 ఏళ్ల లోపు వారు. ఈ ఘటనకు బాధ్యులుగా పరిగణించి ప్రభుత్వం గంటల వ్యవధిలో 13 మందిని అరెస్టు చేసింది. వారిలో ఆ శాఖ మంత్రి కూడా ఉన్నారు. అయితే విచారణ చేసిన తరువాత వారంతా బెయిల్‌పై బయటికి వచ్చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తున్న ప్రజలు, ప్రభుత్వ తప్పిదాన్ని, దోషులను వెనకేసుకొచ్చిన వైనాన్ని తేలిగ్గా తీసుకోలేదు. నిర్మాణరంగంలో తిష్టవేసిన అవినీతిని రాజ్యమే పెంచి పోషిస్తోందని కళ్లెర్రజేశారు. వేలాదిగా రోడ్లపైకి వచ్చారు.

డిసెంబరు 22న ప్రజల పోరాటం తారస్థాయికి చేరుకుంది. 'నోవీ సాడ్' రైల్వే స్టేషనుకు నిరసనకారులు చేరుకున్నారు. రాత్రి సమయంలో ఫోన్ల లైట్లతో వీధులన్నీ వెలుగులు విరజిమ్ముతూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

సెర్బియా చాలా చిన్న దేశం. కోటి లోపు జనాభానే ఉంటారు. 20వ శతాబ్దం వరకు యుగోస్లేవియా భూభాగంలో కలిసి ఉంది. 2008 నుండి స్వతంత్ర హోదాని పొందింది. 2023 జనగణన ప్రకారం సెర్బియా జనాభా 66.2 లక్షలు.

అధ్యక్షుడు 'వ్యాసిక్ దొంగ' అని నినదించారు. 'మీరు దీనికి సమాధానం చెప్పాలి' అన్న ప్లకార్డులు ప్రదర్శించారు. పిల్లలతో సహా బాధితుల ఫొటోలను ప్రదర్శన ముందు భాగంలో ఉంచారు. 'మేమింకా రూఫ్ కిందే ఉన్నాం' అని బిగ్గరగా అరిచారు. 'మీ చేతులు రక్తంతో తడిసిపోయాయి' అని ఎర్ర రంగు పులుముకున్న చేతులను చూపించారు. 'రాజీనామాలు, జైలు, అరెస్టు' నినాదాలతో ఆ ప్రాంగణం మార్మోగిపోయింది.

'అవినీతికి వ్యతిరేకంగా ఈ పోరాటం చేస్తున్నామ'ని గుమికూడిన వారందరూ ముక్తకంఠంతో చెప్పారు. ఆ నిరసనకారుల్లో సాధారణ పౌరులే కాదు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, సెర్బియా పాపులర్ నటీనటులు, సాహిత్యకారులు ఉన్నారు. రాష్ట్రంలో మిగిలిన చోట్ల కూడా ఆ రోజు నిరసనలు జరిగాయి.

నిరసనలను నిలిపివేయాలని పాలకులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. యువతకు విద్య, ఉపాధిలో తాయిలాలు ప్రకటించారు. ప్రజానీకానికి సంక్షేమ పథకాల ఎర వేశారు. అవన్నీ నీటిమీద రాతలేనని, ఏ ఒక్కటీ ఆచరణ వీలుకాదని గ్రహించిన యావత్ దేశప్రజానీకం ఆదివారం రోజు పెద్ద ఎత్తున నిరసనలకు పిలుపునిచ్చింది. సంఘటన జరిగిన రోజు నుండి ఏడు వారాలుగా ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట నిరసనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా బుధవారం యూనివర్శిటీ విద్యార్థులంతా సుప్రీం కోర్టు వెలుపల నిరసనలు చేశారు. మరణించిన వారి సంస్మరణార్థం 15 నిమిషాల పాటు ట్రాఫిక్‌ని స్తంభింపజేశారు.

అవినీతికి వ్యతిరేకంగా లక్షలమంది నిరసనల్లో పాల్గొనడం సెర్బియా చరిత్రలోనే మొదటిసారి అని మీడియా అభివర్ణించింది. ఒక చిన్న దేశంలో అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచంలో ఎంతోమందికి ఆదర్శం.

రంగవల్లి



11 చుక్కల నుండి 1 వచ్చే వరకు (సరి చుక్క)



ఆరాధ్య చెన్నూరి,
సియాటల్,
అమెరికా.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

కలబందతో ప్రయోజనాలు

చాలా సులభంగా పెరిగే కలబంద మొక్క మన చర్మానికి చాలా ఉపయోగపడుతుంది. ఔషధ గుణాలు, పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే సామర్థ్యం కూడా ఈ మొక్కలో ఉన్నాయి.

- కలబందలో విటమిన్లు ఎ, సి, బి6, బి12, ఇ, ఫోలిక్ యాసిడ్, ముఖ్యమైన ఖనిజాలైన కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఐరన్‌లను కలిగి ఉంటుంది.
- చలికాలంలో గానీ, వేసవిలో కలబంద గుజ్జును చర్మానికి పలుచని పూతలా రాసుకొని, తరుచూ మర్దన చేస్తూ ఉంటే చర్మం పొడిబారడం, ఎండిపోయినట్లు, నిర్జీవంగా మారదు. మృదువుగా ఉంటుంది.
- ముఖానికి ఫేస్‌వాష్‌కు బదులుగా కలబంద గుజ్జును రాసుకుని అరగంట తర్వాత సబ్బుతో కడిగితే మృతకణాలు, జిడ్డు తొలగి కాంతివంతంగా మెరుస్తూ ఉంటుంది. ఈ గుజ్జును చంకల్లో రాసుకుని అరగంట తర్వాత కడిగితే చెమట వాసన పోతుంది.
- చర్మం కాలినప్పుడు, కోసుకున్నప్పుడు, శరీరంలో అక్కడక్కడ గడ్డలు కట్టినప్పుడు కలబంద జెల్ రాస్తే ఉపశమనం కలుగుతుంది. గాయం త్వరగా తగ్గుతుంది.
- కలబందలో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు మొటిమలను తగ్గిస్తాయి. మొటిమల వల్ల వచ్చే ఎరుపు, వాపు తగ్గుతుంది.
- కలబంద గుజ్జు శరీరానికి రాసుకుని ఎండలోకి వెళితే ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు వేడి వల్ల చర్మం కమిలిపోకుండా ఉంటుంది.
- ఈ గుజ్జును తేనెలో కలిపి తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మధుమేహం, రక్తపోటును అదుపు చేయడంలో సహాపడుతుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి.
- తలలో చుండ్రు, పుళ్ళు, ఇన్ఫెక్షన్లు, దురద వచ్చినప్పుడు ఈ గుజ్జును రాసి, గంటపాటు ఉంచాలి. ఆ తర్వాత గాఢత తక్కువ ఉన్న షాంపుతో తలస్నానం చేస్తే వెంటనే ఫలితం కనిపిస్తుంది. ఇలా వారంలో ఒకసారి చేస్తూ ఉంటే వెంట్రుకలు ఆరోగ్యంగా పెరుగుతాయి.

నగరంలో నిర్వహించిన భారీ ప్రదర్శన

స్వర్ణోత్సవ వేళ

విద్యారంగ పరిరక్షణకు కదం

కాకినాడలో ఉపాధ్యాయుల మహా ప్రదర్శన

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

స్వర్ణోత్సవ వేళ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కదం తొక్కారు. యుటిఎఫ్ జెండాలు చేతపట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటామంటూ నినదించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం సామంత్రం కాకినాడలో జరిగిన ఉపాధ్యాయుల మహా ప్రదర్శన నగరంలో చర్చనీయాంశంగా మారింది. వేలాది మంది ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో కదం తొక్కడం, ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ నినదించడం ప్రజానీకాన్ని ఆకట్టుకుంది. ఉపాధ్యాయులకు సంఘీభావంగా వివిధ రంగాలకు చెందిన పలువురు మహా ప్రదర్శనలో పాల్గొనడంతో పాటు వారితో కలిసి గళం విప్పారు. పిఆర్ కళాశాల నుంచి ప్రారంభమైన ప్రదర్శన మెయిన్ రోడ్డు, బాలాజీ చెరువు సెంటర్ మీదుగా పిఆర్ కళాశాలలోని వేదిక వద్దకు చేరుకుంది.

కాకినాడ నగర పురవీధుల్లో ఐదు కిలోమీటర్ల మేర హోరెత్తే నినాదాలతో ర్యాలీ సాగింది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ నేతృత్వంలో సాగిన ఈ ప్రదర్శనలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం, పలువురు విద్యావేత్తలు, మేధావులు పాల్గొన్నారు. భారీ జెండాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కరువు పరిస్థితుల అంచనాకు 8న కేంద్ర బృందం రాక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖరీఫ్-2024 కరువు పరిస్థితులను పరిశీలించి అధ్యయనం చేయడానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్‌దేవి నేతృత్వంలోని కేంద్ర బృందం ఈ నెల 8న రాష్ట్రానికి రానున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. కేంద్ర బృందం అన్నమయ్య, చిత్తూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో పర్యటించనుందని సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన అనంతరం ఈ నెల 9న సిఎం చంద్రబాబుతో బృందం భేటీ కానుందన్నారు. బృందంలో పది మంది సభ్యులు మూడు బృందాలుగా క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి కరువు పరిస్థితిపై విశ్లేషించనున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఒక బృందం, చిత్తూరు జిల్లాలో మరో బృందం, మూడో బృందం శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలో పర్యటించనుందని పేర్కొన్నారు. కేంద్ర వ్యవసాయశాఖ కరువు మాన్యువల్ నియామకాల ప్రకారం ఖరీఫ్-2024లో 27 తీవ్ర కరువు, 27 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు.

యువకుల మృతి బాధాకరం

- ఒక్కో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాకినాడ-రాజమహేంద్రవరం మధ్య ఉన్న ఎడిబి రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతిచెందిన మణికంఠ, శ్రీచరణ్ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు జనసేన పార్టీ తరపున రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని, ప్రభుత్వం నుంచి కూడా తగిన సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఐదు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడే ఎడిబి రోడ్డు ఇదని, గత వైసిపి ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో గోతుల మయంగా మారిందన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన యువకులు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ వేడుక నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో మృతిచెందారన్నారు. ఇక నుంచి పిఠాపురం నియోజకవర్గ పర్యటనలకు ఎడిబి రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

మంధానకు పగ్గాలు

- ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ
- 10న రాజ్‌కోట్ వేదికగా తొలి పోరు

ముంబయి: ఐర్లాండ్‌తో జరిగే మూడు వన్డే సిరీస్‌కు టీమిండియా మహిళల జట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్‌కు విశ్రాంతి ఇచ్చిన బిసిసిఐ.. స్మృతి మంధానకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. జనవరి 10నుంచి రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ జరగనుంది. బిసిసిఐ సోమవారం ప్రకటించిన 15మందితో కూడిన జట్టు వైస్ కెప్టెన్‌గా దీప్తి శర్మ, వికెట్ కీపర్లుగా రీచా ఘోష్, ఉమా ఛెత్రి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. హర్మన్‌ప్రీత్ గాయం కారణంగా వెస్టిండ్‌తో జరిగిన తొలి రెండు టి20ల్లో ఆడలేకపోయింది. మూడు టి20లోకి అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ ఆడింది. గతేడాది అక్టోబర్‌లో దుబాయి వేదికగా జరిగిన మహిళల టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడింది. ఇక వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టిన ఫాస్ట్ బౌలర్ రేణుక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది. రేణుక వెన్నుముకపై ఒత్తిడి, పగులుతో ఇబ్బందిపడుతుంది. ఈ క్రమంలో ఐర్లాండ్ సిరీస్ ఇద్దరు ప్లేయర్లకు బిసిసిఐ విశ్రాంతి ఇచ్చింది. దీంతో సయాలీ సత్‌ఘరే, సైమా ఠాకూర్ పేస్ బౌలింగ్ బాధ్యతలను మోయనున్నారు. ఇక మూడు వన్డేలు ఐర్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరుగుతాయి. అన్ని మ్యాచులు ఉదయం 11 గంటలకు మొదలవుతాయి. తొలి వన్డే 10న, రెండో వన్డే 12న, మూడో వన్డే 15న జరుగుతుంది.

షెడ్యూల్...

10(శుక్ర)	: తొలి వన్డే
12(ఆది)	: రెండో వన్డే
15(బుధ)	: మూడో వన్డే

(వేదిక: రాజ్‌కోట్, సమయం: ఉ.11.00గం॥లకు)

జట్టు:
స్మృతి మంధాన(కెప్టెన్), దీప్తి శర్మ(వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, ఉమా ఛెత్రి, రీచా ఘోష్ (వికెట్ కీపర్లు), తేజల్ హసబ్నిస్, రాఘవి బిస్త్, మిన్ను మణి, ప్రియా మిశ్రా, తనూజా కన్వర్, టిటాస్ సాధు, సైమా ఠాకోర్, సయాలీ సత్‌ఘరే.

తొలిరౌండ్‌లోనే ఓడిన నాగల్

అక్లాండ్ ఓపెన్

అక్లాండ్: అక్లాండ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత సంచలన ఆటగాడు సుమిత్ నాగల్ అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే నిష్క్రమించాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సుమిత్ 7-6(10-8), 4-6, 2-6తో యువ ఆటగాడు అలెక్స్ మిఛెల్సన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఈ ఓటమితో నాగల్ ఈ ఏడాదిని విజయంతో ప్రారంభించాలన్న కలలు నిరాశలయ్యాయి. తొలి సెట్‌ను నాగల్ చేజిక్కించుకొనే క్రమంలో ప్రత్యర్థి విసిరిన నాలుగు సెట్ పాయింట్లను బ్రేక్ చేసి మరి ఆ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. రెండోసెట్‌ను పోరాడి ఓడిన నాగల్.. కీలక మూడోసెట్‌లో తొలుత 2-3తో వెనుకబడి ఆ తర్వాత వరుసగా పాయింట్లను కోల్పోయి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాగల్ 96వ ర్యాంక్ ఆటగాడు కాగా.. అలెక్స్ 41వ ర్యాంక్ ప్లేయర్. ఆదివారం జరిగిన అర్హత పోటీలో నాగల్.. ఫ్రాన్స్‌కు చెందిన మన్నారినోను ఓడించి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి నాగల్ నేరుగా అర్హత సాధించిన సంగతి తెలిసిందే.

68వ అండర్-19 జాతీయ స్కూల్ గేమ్స్

బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

- పోటీలను ప్రారంభించిన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రజాశక్తి -అమరావతిబ్యూరో

68వ అండర్-19 జాతీయ స్కూల్ గేమ్స్ బాలికాల వాలీబాల్ పోటీలు విజయవాడ పిబి సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం ప్రారంభ మయ్యాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవవందనం స్వీకరిం చారు. క్రీడలను తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మో హన్ ప్రారంభించారు. ఐదు రోజులు పాటు జరిగే ఈ టోర్నీలో 25 రాష్ట్ర జట్లు పాల్గొ న్నాయి. ఫ్లడ్‌లైట్స్ వెలుగుల లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్లో యువత భాగస్వామ్యాన్ని చురుగ్గా ప్రోత్సహిస్తోందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. పిల్లల శారీరక, మనసిక, సామాజిక శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపేలా క్రీడలు, ఆటలు పిల్లల సర్వతో ముఖాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అలాగే క్రమశిక్షణ, విశ్వాసం, కృషిని పెంపొందించడానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు.

ఆంధ్ర, ఉత్తరాఖండ్ మ్యాచ్

ఆంధ్రప్రదేశ్‌ను క్రీడలకు గ్లోబల్ హబ్‌గా మార్చడానికి స్వర్ణాంధ్ర స్పోర్ట్స్ విజన్-2047లో కలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు...

మధ్యప్రదేశ్ 25-17,25-20,25-26 పాయింట్ల తేడాతో చండీగఢ్‌పై, హిమాచల్ ప్రదేశ్ 25-17,21-25,26-24 పాయింట్లతో తెలంగాణపై, ఆంధ్రప్రదేశ్ 25-15, 25-15, 25-15తో ఉత్తరాఖండ్‌పై విజయం సాధించాయి. మరో మ్యాచ్‌లో జార్ఖండ్‌పై ఒడిశా విజయం సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68